www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 224 | శుక్రవారం 16.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




## తెలంగాణలో పెట్టుబడులకు
# అండగా ఉంటాం..

**పరిశ్రమల స్థాపనకు అన్ని వసతులు సిద్ధం**

సంపద సృష్టి కర్తలకు ప్రభుత్వ సహకారం

- తెలంగాణలో పెట్టుబడులకు భరోసా.. భట్టివిక్రమార్క పిలుపు
- ప్రపంచ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఆహ్వానం
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్న ప్రభుత్వం
- పరిశ్రమల స్థాపనకు అన్ని వసతులు సిద్ధం
- గ్లోబల్ బిజినెస్ మీట్‌లో తెలంగాణ అభివృద్ధిపై భట్టి ప్రసంగం

03



తెలంగాణను పెట్టుబడులకు సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026'లో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఫార్మా, బయోటెక్నాలజీ, ఐటీ, కృత్రిమ మేధ రంగాల్లో ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రోజులవారీగా ఐఏఎస్‌ల డ్యూటీ

## యాదాద్రి ప్లాంట్‌లో నిర్లక్ష్యం.. చీఫ్ ఇంజినీర్ సస్పెండ్

విద్యుత్ ఉత్పత్తి పెంపునకు ఐదుగురు ఐఏఎస్‌ల పర్యవేక్షణ

నాలుగు యూనిట్ల పనితీరుపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



- యాదాద్రి పవర్ ప్లాంట్‌పై సర్కారు స్పెషల్ ఫోకస్
- విద్యుత్ ఉత్పత్తి పెంపునకు ఐదుగురు ఐఏఎస్‌ల పర్యవేక్షణ
- యాదాద్రి ప్లాంట్‌లో నిర్లక్ష్యం.. చీఫ్ ఇంజినీర్ సస్పెండ్
- బొగ్గు సరఫరా నుంచి విద్యుదుత్పత్తి వరకు నిఘా
- యాదాద్రి ప్లాంట్ పనితీరుపై సీఎస్ ప్రత్యేక సమీక్ష
- విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సీఎం ఆదేశం
- ప్లాంట్ సమస్యల పరిష్కారానికి రంగంలోకి ఐఏఎస్ అధికారులు
- యాదాద్రి విద్యుత్ కేంద్రంలో బొగ్గు వినియోగంపై ఆరా
- విధుల్లో నిర్లక్ష్యంపై చీఫ్ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు
- నాలుగు యూనిట్ల పనితీరుపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- రైతులకు నిరంతర విద్యుత్.. అధికారులకు సీఎం హెచ్చరిక
- యాదాద్రి ప్లాంట్‌లో లోపాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్లాంట్‌లో తలెత్తుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధిగమించేందుకు, వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించింది. పవర్ ప్లాంట్ వద్దే విడతలవారీగా విధుల్లో ఉండటానికి వీలుగా వీరిని డిప్యూట్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇవాళ అధికారిక ఉత్తర్వులు జారీ...

## అక్రమ డైరీ దందా గుట్టురట్టు..

- హైదరాబాద్‌లో కల్తీ కోవా పట్టివేత.. డెయిరీలపై దాడులు
- కోల్డ్ స్టోరేజీ లేకుండానే డెయిరీ ఉత్పత్తుల రవాణా
- 3.6 టన్నుల కల్తీ కోవా స్వాధీనం
- ఆరు డెయిరీ యూనిట్లలో అధికారుల ఆకస్మిక తనిఖీలు

05




## న్యాయవ్యవస్థను ఎవరూ
# బెదిరించలేరు



- రాహుల్ పిటిషన్‌పై విచారణ.. న్యాయవ్యవస్థ కీలక వ్యాఖ్యలు
- న్యాయస్థానాలపై ఒత్తిడి ప్రయత్నాలు సాగవు: సుప్రీంకోర్టు
- సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపుపై అభ్యంతరం
- జంతర్ మంతర్ నిరసనలపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

05

**మతం మారితే రిజర్వేషన్ వర్తించదు!** 02

## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఓటర్ల జాబితా సవరణపై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

- నిరసనల సీసీటీవీ దృశ్యాలు భద్రపరచాలని సుప్రీంకోర్టు ఆదేశం
- నిరసనకారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- జంతర్ మంతర్ ఆంక్షలపై ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు
- ఓట్ల తొలగింపు పిటిషన్‌పై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- పోలీసుల చర్యలపై సీసీటీవీ ఆధారాలు సమర్పించాలని ఆదేశం
- నిరసనకారులు, జర్నలిస్టుల పిటిషన్లపై ధర్మాసనం విచారణ

05

## ఇచ్చిన మాటను
# నిలబెట్టుకోవాలి

ఐదు లక్షల సాయం ఎప్పుడందిస్తారు?

- అన్నదాత కుటుంబాలకు అందని బీమా భరోసా
- ఐదు లక్షల పరిహారం కోసం బాధితుల నిరీక్షణ
- హామీలు అమలు చేయడంలో సర్కారు విఫలమైందా?
- బీమా సాయం నిలిపివేతపై హరీశ్ రావు ఆగ్రహం
- పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి
- మరణించిన కర్షకుల కుటుంబాలకు న్యాయం చేయాలి

03



## తప్పు మీది.. నెపం అధికారుల మీదా

విద్యుత్ సంక్షోభంపై రేవంత్ సర్కారుపై హరీశ్ రావు ఫైర్ 05

# సన్నబియ్యం ధరలకు రెక్కలు..

అక్రమ నిల్వలపై నిఘా పెడితేనే ధరలకు కళ్లెం

- సామాన్యుడికి భారంగా మారుతున్న సన్నబియ్యం ధరలు
- ఎల్‌నినో భయాలతో మరింత పెరగనున్న బియ్యం ధరలు
- సన్నబియ్యానికి పెరిగిన డిమాండ్.. ఆకాశాన్నంటుతున్న ధరలు
- అక్రమ నిల్వలపై నిఘా పెడితేనే ధరలకు కళ్లెం
- తగ్గిన దిగుబడులు.. పెరుగుతున్న సన్నబియ్యం ధరలు
- సన్నాల కొనుగోలుకు మిల్లర్లు, వ్యాపారుల పోటీ
- ధరల పెరుగుదలతో సామాన్యులపై అదనపు భారం

02



**50 రోజుల్లో రూ.1,500కు పైగా పెరిగిన సన్నబియ్యం ధరలు**



## 'స్వయం ఏపీ' బ్రాండ్..

మహిళా సంఘాల టర్నోవర్ రూ.69 వేల కోట్లు

- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక
- పొదుపు సంఘాల నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- డ్వాక్రా ఉత్పత్తులకు ఇక ఆన్‌లైన్ మార్కెటింగ్
- పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం

02

మహిళా సాధికారత, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన జాతీయ సరస్ మేళాలో పాల్గొన్న ఆయన, డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఈ ఉత్పత్తులను ఈ-కామర్స్ వేదికలపై అందుబాటులోకి తీసుకురానున్నారు.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

విదేశీ బొగ్గు దిగుమతుల్లో రూ.3 వేల కోట్ల స్కాం?



- బొగ్గు దిగుమతులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
- సింగరేణిలో బొగ్గు ఉన్నా దిగుమతులెందుకు?
- విదేశీ బొగ్గు వెనుక భారీ కుట్ర ఉందన్న కేటీఆర్
- బొగ్గు కొరతపై సర్కారును నిలదీసిన బీఆర్ఎస్
- భోత్రా లాజిస్టిక్స్ ఒప్పందాలపై కేటీఆర్ ప్రశ్నలు

03

# మతం మారితే రిజర్వేషన్ వర్తించదు!

**ఢిల్లీ :** రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు మరోసారి సంచలన తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా మత మార్పిడి ప్రాతిపదికగా రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించేందుకు కృత్రిమ మార్గాలను సృష్టించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. మతం మారినంత మాత్రాన.. రిజర్వేషన్లు, వెనుకబడిన వర్గాల హోదా వంటి ప్రయోజనాలు ఆటోమేటిగ్గా పొందలేరని పేర్కొంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

### ఏమిటీ వివాదం?

తమిళనాడులో హిందూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఇస్లాం మతంలోకి మారినవారికి బీసీ ముస్లిం కేటగిరీలో కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తూ 2024 మార్చిలో ఉత్తర్వులు జారీచేసింది. అయితే.. మతం మారినంత మాత్రాన గతంలో పొందుతున్న రిజర్వేషన్ ప్రయోజనాలను కోల్పోకూడదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే.. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తాజాగా.. సుప్రీంకోర్టు కూడా ఆ తీర్పును సమర్థించింది.కాగా.. 2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన సమీర్ అహ్మద్ అనే వ్యక్తి.. తనను ముస్లిం లబ్బాయిస్ వర్గానికి చెందిన వ్యక్తిగా గుర్తిస్తూ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ అప్లికేషన్‌ను రిజెక్ట్ చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతపై వివాదం రాజుకుంది. ప్రభుత్వం నోటిఫై చేసిన 7 బీసీ ముస్లిం సామాజిక వర్గాల్లో.. కేవలం మత మార్పిడితోనే సభ్యత్వం లభించదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆయా వర్గాల్లో జన్మతః ఆధారంగా సమాజ గుర్తింపు కీలకమని పేర్కొంటూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. దీంతో ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. అక్కడా ఊరట దక్కలేదు.

# 'స్వయం ఏపీ' బ్రాండ్..

**ఆంధ్రప్రదేశ్ :** మహిళా సాధికారత, గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ 'సరస్ మేళా' 2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ బ్రాండ్ ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికలపై అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎం చెప్పారు. జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు సభలో మాట్లాడారు.'ఢిల్లీలో నిర్వహించే జాతీయ మహిళా సరస్ మేళాను తొలిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో నిర్వహించడం ఓ ప్రత్యేకత. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీశక్తికి, నవభారత శక్తికి ప్రతిరూపం. గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత గుర్తింపు తీసుకురావడమే సరస్ మేళా ప్రధాన ఉద్దేశం. మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలతో పాటు సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం ఆరు కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దడమే. మహిళలు కేవలం పొదుపు చేసే స్థాయి నుంచి ఆదాయం సంపాదించే వ్యాపారవేత్తలుగా ఎదగాలి' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.'గతంలో పొదుపు సంఘాలుగా ప్రారంభమైన మహిళా సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చెందాయి. భవిష్యత్తులో ఇవే అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన డ్వాక్రా పొదుపు ఉద్యమం దేశం గర్వించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తున్నాయి. ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాము. ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాము. దీర్ఘకాలిక లక్ష్యంగా 10 లక్షల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తుంది' అని సీఎం వివరించారు.'ఏపీలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు స్వయం ఏపీ బ్రాండ్ తీసుకువచ్చాం. ఈ-కామర్స్, ఆన్ లైన్ షాపింగ్లో స్వయం ఏపీ పేరుతో ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. సంక్షేమంతో పాటు మహిళలకు భరోసా ఇచ్చేలా వారి సాధికారిత కోసం పనిచేస్తున్నాం. మహిళా శక్తిని బలోపేతం చేసేలా తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత బస్సు ప్రయాణంతో 100 కోట్ల ప్రయాణాలు మహిళలు చేశారు. సంక్షేమ పథకమైనా, అభివృద్ధి కార్యక్రమం అయినా మహిళల పేరుతోనే అమలు చేస్తున్నాం. ప్రతీ మహిళకు వెల్ఫేర్ టు వెల్త్ అందాలనేది మా నినాదం. సేవింగ్ మనీ స్థాయి నుంచి మేకింగ్ మనీ స్థాయికి మన ఎస్హెచ్జీ బృందాలు అభివృద్ధి చెందాయి. దేశంలోని ప్రతీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ భారత్ దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చటంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది. మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కల్పించటంతో పాటు సాధికారిత దిశగా ఏపీ పనిచేస్తోంది. ఎస్ హెచ్ జీల సాయంతో స్వర్ణాంధ్ర 2047 కలను సాకారం చేసేలా ముందుకు వెళ్తున్నాం. ప్రతీ ఎస్ హెచ్ జీ ఓ ఆర్థిక శక్తిగా, ప్రతీ మహిళా పారిశ్రామికవేత్తగా, ప్రతీ గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలన్నదే మా ఆలోచన' అని సీఎం చెప్పుకొచ్చారు.

# న్యాయవాదులు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ సేవలను వినియోగించుకోవాలి..




**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** న్యాయవాదులు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ కోరారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో మ్యూచువల్ ఏయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేషనరి స్టోర్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమైన కో-ఆపరేటివ్ సోసిటీ ని ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. సొసైటీ సభ్యులు బాగా పని చేసి న్యాయవాదులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కో-అపరేటివ్ సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మణ్, సెక్రెటరీ బెజ్జంకి శ్రీకాంత్, వైస్ చైర్మన్ చంద్రపాటి కిరణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బొడ్ల గీతారాణి, కోశాధికారి సుంకే దేవకిషన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# సన్నబియ్యం ధరలకు రెక్కలు..

**ఆమనగల్లు,ఫ్లాష్ ఇండియా :** సన్నబియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 50 రోజుల వ్యవధిలో బియ్యం ధరలు రూ.1,500లకు పైగా పెరిగాయి. ఎల్‌నినో కారణంగా ఈ ధరలు మరింతగా పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసిన తొలినాళ్లలో సన్నబియ్యం ధరలు దిగివచ్చాయి. ఆ తర్వాత మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. వర్షాలు తక్కువగా కురవడం, ఎల్‌నినో కారణంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులను చూస్తున్నాం. దానితో పాటు రేషన్ బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. దీంతో నాణ్యమైన సన్నబియ్యానికి డిమాండ్ ఏర్పడింది.

### నియంత్రణ పై దృష్టి పెడితే..

బియ్యం ధరల పై ప్రభుత్వంతో పాటు ధరల నియంత్రణ కమిటీలు కూడా కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం 50 రోజుల్లోనే ధరలు ఈ విధంగా పెరిగిపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చు. జిల్లాకేంద్రంలో కొందరు వ్యాపారులు సన్నబియ్యాన్ని రహస్యంగా నిల్వ చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అధికారులు అక్రమ నిల్వలను గుర్తించడానికి తనిఖీలు చేస్తే ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశాలు ఉంటాయి. కొనుగోలుదారులు వ్యాపారుల నుంచి బిల్లులను తీసుకుంటే మంచిది.

### సన్నాలకు డిమాండ్..

ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందజేస్తుంది. దీంతో చాలా మంది రైతులు సన్నాలను సాగు చేస్తున్నారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యాపారులు, మిల్లర్లు సన్నరకం ధాన్యాన్ని కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో సన్నాలకు డిమాండ్ ఏర్పడింది. అధిక మొత్తం చెల్లించైనా సన్నాలను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఈ ఏడాది సన్నరకం బియ్యం వ్యాపారులు, మిల్లర్ల వద్దకే వెళ్లే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ సమస్యలతో చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రభావంతో దిగుబడులు తగ్గనున్నాయి. సామాన్యులకు అందుబాటు ధరల్లో బియ్యం లభించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ రాకేష్

**కరెంటు మీటర్ల పేరుతో రూ. లక్షా 20 వేలు లంచం...**



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కరెంటు మీటర్ల పేరుతో రూ. లక్షా 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు మాదన్నపేట ఏఈ రాకేష్. గురువారం ( అక్టోబర్ 15 ) సంతోష్ నగర్ లో ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఏఈ రాకేష్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. టీజీఎస్‌పీడీసీఎల్ లో మదన్నపేట ఏఈగా పని చేస్తున్న రాకేష్ కరెంటు మీటర్ల కోసం రూ. లక్షా 20 వేలు లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించారు బాధితులు.బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సంతోష్ నగర్ లోని టీజీఎస్‌పీడీసీఎల్ ఆఫీసులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా.. ఏఈ రాకేష్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు అధికారులు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు అధికారులు.నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు శుక్రవారం ( అక్టోబర్ 16 ) కోర్టు ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రోజులవారీగా ఐఏఎస్‌ల డ్యూటీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్లాంట్‌లో తలెత్తుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధిగమించేందుకు, వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించింది. పవర్ ప్లాంట్ వద్దే విడతలవారీగా విధుల్లో ఉండటానికి వీలుగా వీరిని డిప్యూట్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇవాళ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 15 నుంచి 3 వరకు దాదాపు 15 రోజుల పాటు ఈ సీనియర్ అధికారులు ప్లాంట్ వద్దే ఉండి అన్ని అంశాలను పరిశీలించనున్నారు.

### రోజులవారీగా ఐఏఎస్‌ల డ్యూటీ ఇలా..

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం.. హరికిరణ్, ఐఏఎస్ అక్టోబర్ 15 నుంచి 17 వరకు, వెంకటేష్ ధోత్రే, ఐఏఎస్ అక్టోబర్ 18, 19 తేదీల్లో, రాహుల్ రాజ్ ఐఏఎస్ అక్టోబర్ 22 నుంచి 24 తేదీల్లో క్యాంప్ చేస్తారు. ఇక జెండేజ్ హనుమంత్ కొండిబా, ఐఏఎస్ అక్టోబర్ 25 నుంచి 27 వరకు, కిల్లు శివకుమార్ నాయుడు, ఐఏఎస్ అక్టోబర్ 28 నుంచి 30 వరకు యాదాద్రి పవన్ ప్లాంట్ వద్ద పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

### SOP ప్రకారం విచారణ.. నివేదిక ఇవ్వాలని సీఎస్ ఆదేశాలు..

ప్లాంట్‌కు వెళ్లే అధికారులు నిర్దిష్టమైన అంశాలపై పూర్తి స్థాయి అధ్యయనం చేసి నివేదికను అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్లాంట్‌లోని 4 బొగ్గు స్ట్రీమ్‌లు సరిగ్గా పనిచేస్తున్నాయా? ఏవైనా అంతరాయాలు ఉంటే కారణాలేంటి? ప్లాంట్‌కు చేరుతున్న బొగ్గు గ్రేడ్ ఎంత? ఆ గ్రేడ్‌కు తగినట్లుగానే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా లేక ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా? అన్ని యూనిట్లలో బంకర్లకు బొగ్గు సరఫరా నిరంతరాయంగా సాగుతుందా? మధ్యలో ఏవైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా? ప్లాంట్ నిర్మాణ బాధ్యతలు చూస్తున్న 'భెల్' వద్ద పెండింగ్‌లో ఉన్న పనుల పరిస్థితి ఏంటి? బొగ్గు వ్యాగన్ల అన్‌లోడింగ్ సమయం, టర్న్ అరౌండ్ టైమ్ ఏ విధంగా ఉంది? దానిని మరింత వేగవంతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ప్లాంట్‌లోని అన్ని 4 యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయా? ఒకవేళ ఉత్పత్తిలో లోటు ఉంటే దానికి గల స్పష్టమైన కారణాలను నివేదికలో పొందుపరచాలని సీఎస్ సంజయ్ జాజు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### టీపీఎస్ చీఫ్ ఇంజనీర్ సురేష్‌పై సస్పెన్షన్ వేటు..

దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్-1 నిర్మాణంలో విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు గాను చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ బి.సురేష్ ను టీజీ జెన్‌కో సీఎండీ హరీశ్ సస్పెండ్ చేశారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్టేజ్-1 లో విద్యుత్ ఉత్పత్తి పనితీరు మెరుగుపరచడంపై గత 2 నెలలుగా జెన్‌కో సీఎండీ, డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గత 15 రోజులుగా ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కూడా పరిస్థితులను గమనిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్లానింగ్, మానిటరింగ్, విద్యుత్ ఉత్పత్తి పనుల నిర్వహణలో వైటీపీఎస్ స్టేజ్-1 చీఫ్ ఇంజనీర్ బి.సురేష్ నిర్లక్ష్యం వహించినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో ఆయనపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ, తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లుగా టీఎస్ జెన్‌కో సీఎండీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కాగా, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఆయా పవర్ ప్లాంట్‌లలో విద్యుత్ సరఫరా పెంచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై బుధవారం సీఎం రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ఉన్నతాధికారులతో సమీక్షించిన విషయం తెలిసిందే. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీతో సహా ఎవరినీ ఉపేక్షించబోనని, అవసరమైతే సస్పెండ్ చేస్తానని ఆయన హెచ్చరించిన గంటల వ్యవధిలోనే వైటీపీఎస్ స్టేజ్-1 చీఫ్ ఇంజనీర్ సురేశ్‌పై సస్పెన్షన్ వేటు పడటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# రైతుల అభివృద్ధిలో సహకార సంఘాలదే కీలక పాత్ర



**నిజాంసాగర్,ఫ్లాష్ ఇండియా :** రైతుల అభివృద్ధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) కీలక పాత్ర పోషించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలకవర్గాలకు సూచించారు. గురువారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, మల్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన అధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్లూర్ సహకార సంఘం అధ్యక్షురాలిగా భుజంగారి వినోద వెంకటరాంరెడ్డి, అచ్చంపేట సహకార సంఘం అధ్యక్షుడిగా పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళీధర్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు తగిన న్యాయం జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తోందని తెలిపారు. అచ్చంపేట గ్రామానికి చెందిన మేతరి లక్ష్మికి దళితబంధు పథకం కింద రూ.10 లక్షలు అందాల్సి ఉండగా, కేవలం రూ.2 లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఆమెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న లక్ష్మికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, సహకార సంఘంలో డైరెక్టర్ పదవి కూడా కల్పించినట్లు వెల్లడించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు నిరంతరం అండగా నిలవాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నూతన పాలకవర్గాలకు సూచించారు.

### కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యకర్తలే తనకు బాస్‌లని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికి సముచిత ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కార్యకర్తలు నిరాశ చెందకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### నిజాంసాగర్ అభివృద్ధికి రూ.10 కోట్లతో ఎకో టూరిజం

నిజాంసాగర్ మండల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఏలే మల్లికార్జున్ తెలిపారు. అచ్చంపేట గ్రామంలో చేపల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసినట్లు వెల్లడించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు అభివృద్ధిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కృషితో రూ.10 కోట్ల వ్యయంతో ఎకో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ప్రాంతీయ అభివృద్ధితో పాటు పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు యూనుస్ పటేల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రజా పండరి, రవీందర్‌రెడ్డి, పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్‌కుమార్, చిల్లర్గి సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళీధర్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మంద బలరాం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంకు లక్ష్మయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 75మంది జవాన్లకు అస్వస్థత



**మణిపూర్ :** మణిపూర్, ఇంఫాల్‌లోని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. ఈ ఘటనలో దాదాపు 75మంది బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం ఈ ఘటన జరగ్గా జవాన్లను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయం జవాన్లు, సిబ్బంది బ్రేక్ ఫాస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఆహారం తిన్న తరవాత వాంతులు, కడుపునొప్పి లాంటి లక్షణాలు కనిపించాయి. ఈ క్రమంలో ఆహారంత తిన్న 78మంది అస్వస్థతకు గురయ్యారు.వెంటనే వారిని స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జవాన్లు చికిత్స పొందుతుండగా వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. అయితే ఫుడ్ పాయిజన్‌కు కారణం ఏంటి అనేది ఇంకా తెలియలేదు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే సంబంధిత ఆహార పదార్థాలను సేకరించి పరిశీలించేందుకు ల్యాబ్‌కు తరలించారు. పరీక్షల అనంతరం అసలు కారణం తెలిసే అవకాశం ఉంది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సింగరేణి ప్రైవేటీకరణపై క్లారిటీ..



హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : సింగరేణి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించబోతున్నామంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని శాఖ మంత్రి శ్రీధర్ బాబు తేల్చి చెప్పారు. సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. గత పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం ఒక 'జేబు సంస్థ'గా మార్చుకుందని ఆరోపించారు. అంతేకాకుండా, సింగరేణికి భారీగా బకాయిలు పెట్టి సంస్థను ఆర్థికంగా దెబ్బతీసింది కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. అలాంటి బీఆర్ఎస్ నాయకులకు ఈరోజు సింగరేణి కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్యానించారు.

**అనవసర ఆరోపణలను నమ్మవద్దు..**

సింగరేణి సంస్థను దెబ్బతీసి, దానికి చెడ్డపేరు తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని, వారు చేస్తే అనవసర ఆరోపణలు, విమర్శలను ప్రజలు, సింగరేణి కార్మికులు పట్టించుకోవాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను కూడా పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా : దేశం మెచ్చిన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారు. సిద్దిపేటలో రైతు బీమా అందని 22 మంది రైతు కుటుంబాలతో క్యాంపు ఆఫీసు వేదికగా సమావేశం. ఈ సందర్భంగా వారితో కలిసి భోజనం చేసి అనంతరం ఆయా కుటుంబాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నాను. రైతు బీమా పథకం కింద రూ. 5 లక్షల సాయం అందకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారు వివరించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు కుటుంబాల ఆవేదన చూస్తే మనస్సు చలించి పోతున్నది. ప్రభుత్వం కళ్లు తెరిపించాలని బీఆర్ఎస్ పక్షాన ఒక ఎమ్మెల్యేగా సిద్దిపేటలో రైతు బీమా అందని బాధిత కుటుంబాలతో సమావేశం అయ్యాం.ఆగస్టు 15 నుంచి ఈరోజు వరకు ఒక్క సిద్దిపేటలోనే 22 మంది రైతులు చనిపోయారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది రైతులు చనిపోయారు. రైతు బీమా నిలిపివేయడం వల్ల ఇప్పుడు ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.రేవంత్ రెడ్డి... కేసీఆర్ గారు అమలు చేసిన పథకాలు కొనసాగిస్తున్నాం అని మాటలు చెప్పారు. కానీ నిజానికి అన్నీ బంద్ చేస్తున్నారు.రైతు బీమా పథకం అమలు చేసి ఉంటే ఇంత మంది రైతు కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతున్నాయి.వీరందరికి ఎందుకు 5 లక్షల డబ్బులు రాలేదు.ఆగస్టు 14 నుంచి ఎల్ ఐ సీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రాష్ట్రంలో రైతు బీమా ఆగిపోయింది.ఇక్కడ కన్నీళ్లు మున్నీరు అవుతున్న బాధితులకు మీరేం సమాధానం చెబుతారు.వీరిని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాం.ముఖ్యమంత్రి, తుమ్మల గారు వీరి బాధను ఎలా తీర్చుతారు.తుమ్మల గారు మీరు రైతు, మీరైనా ప్రీమియం చెల్లించాలని చెప్పాలి కదాకొత్త పథకం తెస్తాం అని బడ్జెట్ లో చెప్పారు. ఆ పథకం ఇప్పటికీ అతీ గతీ లేదు.కేసీఆర్ గారు గుంట భూమి ఉంటే పథకం వర్తింప చేసారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి పథకం వర్తింప చేసారుమీరు చెప్పే పథకం కేవలం ఇంటి యజమానికి మాత్రమేమీరు చెబుతున్న కొత్త బీమా పథకం వచ్చింది లేదు అమలు అయ్యింది లేదుఐక్య రాజ్య సమితి సైతం మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేసేందుకు మనస్సు ఎలా వచ్చింది రేవంత్ రెడ్డిఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తున్నాయి. కానీ మీరు మాత్రం బంద్ చేసారు, రద్దు చేసారు. ఏ కారణంతో చని పోయినా రైతు కుటుంబం రోడ్డున పడొద్దని కేసీఆర్ గారు రైతు బీమా అనే పథకానికి 2018లో రూపకల్పన చేసిండు.రైతుల తరుపున ప్రభుత్వమే ఏటా 1400 కోట్ల ప్రీమియం ఎల్ ఐ సీకి చెల్లించి, 5 లక్షల భరోసా కల్పించిండు.2018--19 నుంచి 2023--24 వరకు వివిధ కారణాలతో మరణించిన 1,38,688 మంది రైతు కుటుంబాలకు 7వేల కోట్లు చెల్లించింది బిఆర్ఎస్ ప్రభుత్వం.రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి, ప్రీమియం 1400 కోట్లు చెల్లించే తెలివి లేదా? వెంటనే ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా రైతు కుంటుంబాలకు చెల్లించాలని, యదావిదిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసన్నాం.కేసీఆర్ గారి పథకాలు ఆపలేదంటున్న రేవంత్ రెడ్డి, రైతు బీమా, కేసీఆర్ కిట్టు, న్యూట్రీషన్ కిట్టు, గొర్రెల పంపిణీ పథకం, ఫీజు రియింబర్స్ మెంట్ ఇలా అనేక పథకాలు బంద్ చేసావుకేసీఆర్ గారు 24 గంటల కరెంట్ ఇస్తే, మీరు 8 గంటలు కూడా ఇవ్వడం చేతకావడం లేదుఐఏఎస్, అధికారులను సస్పెండ్ చేస్తాం అని ఎవరి చెవిలో పువ్వులు పెడుతున్నారు.నువ్వు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గారే విద్యుత్ మంత్రి.సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదు, మిమ్మల్ని చేయాలి.9 నెలల నుంచే ఎల్ ని నో ఎఫెక్ట్ ఉంటుందని చెబుతుంటే ఏం చేసారు.కరెంట్ సరఫరా చేయకపోవడం మీ చేతగాని తనం కాదా రేవంత్ రెడ్డి,విద్యుత్ అధికారులను బాధ్యులుగా చేసి ఎందుకు వారిపై చర్యలు తీసుకుంటున్నారునీళ్లు ఉన్నా లిఫ్ట్ చేయలేదు, పంట పొలాలకు నీళ్లు ఇవ్వలేదు.బొగ్గు నిల్వలు పెట్టుకోక కరెంట్ కోతలకు కారణం అయ్యారుఅధికారుల తప్పు కాదు ఇది, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫెయిల్ అయ్యారు.మీ చేతగాని తనం విద్యుత్ అధికారులపై వేటు వేస్తారారైతు బీమా పథకాన్ని ఆపేసారు ఈ విషయం మీకు తెల్వదా? మీకు రిపోర్టులు రావడం లేదా?రైతు కుటుంబాలు అప్పుల పాలయ్యాయి. అయిన వారిని కాపాడుకునేందుకు ఆసుపత్రులు తిరిగి అప్పుల పాలయ్యారు.వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రాణాలు కోల్పోయిన మూడు వేల మంది రైతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి. ఎల్ ఐ సీకి ప్రీమియం చెల్లించి యథావిధిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం దిగిరాకపోతే రైతు కుటుంబాలతో కలిసి సీఎం ఇల్లు ముట్టడిస్తాం, సచివాలయం ముట్టడిస్తాం అని హెచ్చరిస్తున్నాం.రైతు కుటుంబాలు ఆందోళన చెందవద్దు. బిఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. అసెంబ్లీ వేదికగా రైతు బీమా పై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. మీకు బీమా డబ్బులు వచ్చేలా చేస్తాం.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3వేల కోట్ల భారీ స్కాంకు కుట్ర చేస్తున్నారని లేఖలో ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నా.. దేశంలో బొగ్గు వనరులు ఉన్నా దేశీయ సరఫరా పెంచే చర్యలు తీసుకోకుండా విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపడం అనుమానాలకు దారి తీస్తోందని పేర్కొన్నారు. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికలతో ఎదుర్కోవాల్సి ప్రభుత్వం కరెంట్ కోతలపై ప్రజలు, రైతుల ఆందోళనలను బూచిగా చూపించి దిగుమతులకు అనుకూలంగా మలుచుకోవడం వెనుక భారీ స్కామ్ దాగి ఉందని తెలిపారు.భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం చీకటి ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. కావాలనే కృత్రిమ బొగ్గు కొరత సృష్టించి కరెంట్ సంక్షోభం సృష్టించి అదనుచూసి కంపెనీని రంగంలోకి దింపారని ఆరోపించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని అన్నారు.సింగరేణిలో 2023-2024లో సుమారు 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైందని, 2025-26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని తెలిపారు. ఈ తగ్గుదలకు కారణం ఏంటని ప్రశ్నించారు. బొగ్గు ఉత్పత్తి సమర్థ్యం ఉన్నప్పుడు ఎందుకు వినియోగించుకోవడంలేదని ప్రశ్నించారు. సింగరేణికి రావాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, సుమారు రూ.60వేల కోట్ల బకాయిలు ఉన్న లెక్కలపై సంస్థల వారిగా పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# దసరా రోజు ప్రారంభం

హనుమకొండ,ఫ్లాష్ ఇండియా : వరంగల్ నగరంలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఈనెల 20న దసరా సందర్భంగా సాఫ్ట్ లాంచ్ చేసి ఓపీని ప్రారంభించనున్నట్లు సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేము నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, పోరిక బలరాం నాయక్, కూడా చైర్మన్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్‌లతో కలిసి అధికారులతో సాఫ్ట్ లాంచ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకే తలమానికంగా ఉండే ఎంజీఎం హాస్పిటల్ గత కొన్ని దశాబ్దాలుగా పలు ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు వైద్య సేవలు అందించింది అదే నమ్మకంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభమైన తర్వాత ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ గత ప్రభుత్వం పేపర్ మీద మాత్రమే చూపించి వదిలేసిన పనులను చిత్తశుద్ధితో ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నా పూర్తి చేస్తున్నామని అన్నారు. నూతన ఎంజీఎం హాస్పిటల్ పూర్తిస్థాయిలో డిసెంబర్ 15 వరకు పూర్తి చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. నూతన ఎంజీఎం హాస్పిటల్ ప్రారంభమైన తర్వాత ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్ షట్ డౌన్ అయ్యే పరిస్థితి ఉంటుందని ఆ స్థాయిలో నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు.

# తెలంగాణలో పెట్టుబడులకు అండగా ఉంటాం..

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : తెలంగాణను పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన , అనుకూలమైన గమ్యస్థానంగా మలచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026' సదస్సులో ఆయన పాల్గొని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు ముందుకు వస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.

**పెట్టుబడులకు అద్భుతమైన అనుకూలతలు**

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూమి, నిరంతరం విద్యుత్, , నీటి సదుపాయాలను సులభంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, మెరుగైన మౌలిక వసతులు పారిశ్రామిక రంగానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రత్యేక క్లస్టర్లు, గ్రామీణ ప్రాంతాలకు ప్రోత్సాహం**

ఫార్మా, బయోటెక్నాలజీ, ఐటీ, , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల అభివృద్ధి కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ మధ్య పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 21 రేడియల్ రోడ్ల మంజూరు , రూపకల్పన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని వివరించారు. కేవలం నగరాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు.

**సమ్మిళిత అభివృద్ధికి పెద్దపీఠం**

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు, సేవారంగాలదే కీలక పాత్ర అని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. సంపద సృష్టికర్తల వల్లే రాష్ట్ర ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని, ఈ క్రమంలో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచ వ్యాపారవేత్తలను హైదరాబాద్‌కు తీసుకురావడం రాష్ట్ర పురోగతికి గొప్ప అవకాశమన్నారు. కేవలం లాభాలార్జనే కాకుండా, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ అందాలని, ఇతర వర్గాలకూ వ్యాపార అనుభవం, పరిజ్ఞానం పంచుతూ సమ్మిళిత అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పారిశ్రామిక అనుకూల విధానాలను అమలు చేస్తూ, తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు.



# కమీషన్ల దందాకు అడ్డాగా సీఎం ఆఫీస్

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయాన్ని కమీషన్లకు అడ్డగా మార్చేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పనికి 15 శాతం కమీషన్ కావాలంటూ నేరుగా సీఎంవో నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయమని పేర్కొన్నారు. తమ అనుచరులకు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు చట్టాన్ని, నిబంధనలను ఏమాత్రం లెక్కచేయటం లేదని తెలిపారు. ఎలాంటి అర్హతలు లేని వారికి కేవలం కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాపాలన కాదని.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అని విమర్శించారు. తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అరాచకాలను సహించదని హెచ్చరించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణగా ఉండాల్సిన సీఎం, ఆయన ఆఫీస్ నుంచే ఇలాంటి ఆగడాలు జరగటమేంటని ప్రశ్నించారు. ప్రజలను దోచుకుంటూ కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడుతున్న వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ లూటీకి పాల్పడిన వాళ్లందరిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. మహిళా రైతుల కోసం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధంగా మహిళా రైతుల సాధికారిత చట్టాన్ని.. తెలంగాణలోనూ తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. కుటుంబాన్ని చూసుకుంటూనే ఉదయం నుంచి రాత్రి వరకు పొలం, పాడి పనులతో తీరిక లేకుండా శ్రమిస్తున్న వారికి కనీస గుర్తింపు దక్కటం లేదని పేర్కొన్నారు. మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా సాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో 80 శాతం భాగస్వాములుగా ఉన్న మహిళల శ్రమను గుర్తిస్తూ.. వారిని గౌరవించుకుందామని పేర్కొన్నారు.

# రేగోడు పీఎం శ్రీ మోడల్ కళాశాల విద్యార్థినుల 'వృత్తి శిక్షణ'





మెదక్ జిల్లా/రేగోడు ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి : మండల కేంద్రంలోని రేగోడు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (వృత్తిపరమైన ) మొదటి సంవత్సరం విద్యార్థినుల ప్రత్యక్ష వృత్తి శిక్షణా కార్యక్రమం (ఇంటర్న్‌షిప్) విజయవంతంగా కొనసాగుతోంది. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థినులు నారాయణ్‌ఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, రేగోడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో ప్రాక్టికల్స్ చేస్తున్నారు. ఇంటర్ అర్హతతో అతి తక్కువ సమయంలోనే వైద్య రంగంలో స్థిరపడేందుకు దోహదపడే 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్' (GDA) కోర్సులో భాగంగా ఈ ప్రత్యక్ష క్లినికల్ శిక్షణను అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, ఒకేషనల్ ట్రైనర్.గీత వెల్లడించారు. రేగోడు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ కళాశాల నుండి మొత్తం 31 మంది విద్యార్థినులు ప్రస్తుతం ఈ రెండు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యక్ష శిక్షణ పొందుతున్నారు. వీరిలో 23 మంది విద్యార్థినులు నారాయణ్‌ఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రమేష్ ప్రత్యేక ఆధ్వర్యంలో, స్థానిక వైద్యాధికారుల పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేస్తున్నారు. మిగిలిన 8 మంది విద్యార్థినులు రేగోడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కేటాయించిన వైద్యాధికారుల సంరక్షణలో వైద్య విధులను క్షుణ్ణంగా నేర్చుకుంటున్నారు. ఆసుపత్రి వాతావరణంలో రోగులకు ఎలా సేవలు అందించాలనే విషయాలపై ఒకేషనల్ ట్రైనర్ ఎమ్. గీత మార్గదర్శకత్వంలో విద్యార్థినులు పూర్తి నైపుణ్యాలను అభ్యసిస్తున్నారు. జనరల్ వార్డులలో రోగుల రోజువారీ అవసరాలను చూసుకోవడం, బీపీ, పల్స్ రేట్, శరీర ఉష్ణోగ్రత వంటి వైటల్ సైన్స్ తనిఖీ చేయడం, అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స (First Aid) అందించడం, ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా వార్డుల నిర్వహణ, పారిశుధ్య జాగ్రత్తలు తీసుకోవడం వంటివి నేర్చుకుంటున్నారు.విస్తృత ఉద్యోగ అవకాశాలు: ఈ జీడీఏ (GDA) కోర్సు పూర్తి చేసిన వెంటనే కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ దవాఖానలు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లలో వార్డ్ అసిస్టెంట్, పేషెంట్ కేర్ అసిస్టెంట్, నర్సింగ్ ఎయిడ్ వంటి హోదాల్లో వెంటనే ఉద్యోగాలు లభిసాయి. ప్రస్తుతం హెల్త్‌కేర్ రంగంలో హోమ్ హెల్త్ కేర్, వృద్ధుల సంరక్షణ కేంద్రాలు,పునరావాస కేంద్రాలలో కూడా శిక్షణ పొందిన జీడీఏ సిబ్బందికి భారీ డిమాండ్ నెలకొంది. ఈ కోర్సు ఆధారంగా ప్రముఖ నియామక వేదికలైన Naukri GDA Portal ,Indeed GDA Openings ద్వారా ప్రారంభ స్థాయిలోనే వేతనంతో కూడిన ఉద్యోగాలు సులభంగా పొందవచ్చు. వైద్య రంగంలో ఉన్నత స్థాయి డిప్లొమా, పారామెడికల్ కోర్సులు చేసేందుకు ఇది బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడుతూ, సుదీర్ఘమైన నర్సింగ్ కోర్సులు చేయలేని పేద, మధ్యతరగతి విద్యార్థినులకు రేగోడు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ కళాశాల అందిస్తున్న ఈ ఒకేషనల్ కోర్సు ఒక సువర్ణావకాశం అని తెలిపారు. ఇంటర్ విద్యార్హతతోనే విద్యార్థినులు త్వరగా సొంత కాళ్లపై నిలబడటానికి ఈ ప్రత్యక్ష వృత్తి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని, భవిష్యత్తులో వీరంతా వైద్య సేవా రంగంలో ఉత్తమ సేవలందిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# 320 మండలాల్లో కరువు

## తెలంగాణపై 'ఎల్‌నినో' తీవ్ర ప్రభావం..




హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, కరువు ముప్పు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఎం శనివారం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. అందులోనూ 117 మండలాల్లో తీవ్రమైన కరువు తాండవిస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు రామకృష్ణారావు ఎల్‌నినో తీవ్రత, దాని వల్ల కలిగే ప్రభావాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన 'కేబినెట్ సబ్ కమిటీ'..**

కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు గాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సబ్ కమిటీ కరువు పరిస్థితులను అధిగమించేందుకు, తాగునీరు, సాగునీరు, పంట నష్టాల నివారణకు సమగ్రమైన 'రోడ్ మ్యాప్' సిద్ధం చేయనుంది. కేబినెట్ సబ్ కమిటీ తన తొలి సమావేశాన్ని రేపు (శుక్రవారం) నిర్వహించనుంది.మరోవైపు ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం తేల్చింది. ఈ నష్టానికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఇందుకోసం రూ.1,118 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రం కానుందని వాతావరణ శాఖ అంచనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు, పంటనష్టం, తాగునీరు, సాగునీటి లభ్యతపై ప్రభుత్వ యంత్రాంగం సమగ్ర నివేదిక రూపొందించింది. ఈ నివేదికను ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారులు సమర్పించారు.

## సంపాదకీయం




# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన హోటళ్లు అనారోగ్యానికి, చివరకు ప్రాణాపాయానికి కారణమవుతుంటే ఎవరిని ప్రశ్నించాలి? ఆహార నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది? నర్సాపూర్‌లోని ఓ మండి హోటల్‌లో భోజనం చేసిన పలువురు అస్వ-స్థతకు గురికావడం, పీర్ల సాయిరామ్ అనే యువకుడు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటన ఒక హోటల్‌కు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆహార భద్రత వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్న పరిణామం. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అధికారుల ప్రాథమిక బాధ్యత.ప్రస్తుత జీవనశైలిలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు ప్రజల దైనందిన జీవితంలో కీలకంగా మారాయి. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు, కుటుంబాలు నిత్యం బయట లభించే ఆహారంపై ఆధారపడుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రంతో పాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట, పెద్దశంకరంపేట ప్రాంతాల్లోనూ, జాతీయ రహదారుల వెంటనూ అనేక ఆహార విక్రయ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. వ్యాపారాల విస్తరణ ఉపాధి అవకాశాలను పెంచుతున్నప్పటికీ, వినియోగదారులకు సురక్షితమైన ఆహారం అందించడం అంతే ముఖ్యమైన అంశం. హోటళ్ల సంఖ్య పెరుగుతున్నప్పుడు వాటి నిర్వహణపై పర్యవేక్షణ కూడా పెరగాలి. కానీ తనిఖీలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తుండటం ఆందోళనకరం.ఆహార పదార్థాల నాణ్యత, వంటగది పరిశుభ్రత, తాగునీటి స్వచ్ఛత, ముడి సరుకుల నిల్వ, వంట నూనె వినియోగం వంటి అంశాల్లో నిర్లక్ష్యం జరిగితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కుళ్లిన మాంసం, కలుషిత పదార్థాలు, నాణ్యత లేని సరుకులతో తయారు చేసిన ఆహారం అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయకపోవడం, వంట ప్రదేశాలను శుభ్రంగా ఉంచకపోవడం, పరిశుభ్రమైన నీటిని ఉపయోగించకపోవడం కూడా సమస్యలను సృష్టిస్తాయి. అందువల్ల వ్యాపారానికి అనుమతులు ఉండటం ఒక్కటే సరిపోదు. ఆహార భద్రతా ప్రమాణాలు నిత్యం పాటిస్తున్నారా లేదా అన్నది నిరంతరం పరిశీలించాలి.గతంలోనూ కొన్ని హోటళ్లలో ఆకస్మిక తనిఖీల సందర్భంగా కుళ్లిన చికెన్, నాసిరకం పదార్థాలు, పదేపదే వినియోగించిన వంట నూనె గుర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అటువంటి సందర్భాల్లో జరిమానాలు విధించి వదిలేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. తప్పిదాలకు పాల్పడిన యాజమాన్యాలు మళ్లీ అదే విధంగా వ్యవహరిస్తే ప్రజలే మూల్యం చెల్లించాల్సి వస్తుంది. జరిమానాలకే పరిమితమయ్యే చర్యలతో ఆహార నాణ్యత మెరుగుపడుతుందా అన్నది అధికారులు ఆలోచించాలి. ఉల్లంఘనల తీవ్రతను బట్టి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైన సందర్భాల్లో వ్యాపార కార్యకలాపాలను నిలిపివేయడం, లైసెన్సులపై చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలి. తనిఖీలు కేవలం పర్యటనలకో, తాత్కాలిక ప్రచారానికో పరిమితం కాకూడదు.నర్సాపూర్ ఘటనలో పలువురు అస్వస్థతకు గురికావడం, ఒక యువకుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరపాలి. ఆహార కలుషితమే అనారోగ్యానికి కారణమా, ఏ పదార్థం వల్ల సమస్య తలెత్తింది, బాధ్యత ఎవరిది అనే అంశాలను వైద్య నివేదికలు, ఆహార నమూనాల పరీక్షలు, అధికారిక విచారణ ఆధారంగా నిర్ధారించాలి. నిర్ధారణకు ముందే ఎవరినీ దోషిగా ప్రకటించకుండా, వాస్తవాల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నివారణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.జిల్లాలో ఆహార భద్రతా అధికారులు ఉన్నారా లేదా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయంటే సంబంధిత యంత్రాంగం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. ముఖ్యంగా జాతీయ రహదారుల వెంట ఉన్న ఆహార కేంద్రాలు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, గతంలో ఫిర్యాదులు అందిన వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తనిఖీల్లో గుర్తించిన లోపాలను నమోదు చేసి, వాటిని సరిదిద్దేందుకు గడువు విధించాలి. తీవ్రమైన ఉల్లంఘనలు కనిపిస్తే తక్షణమే చట్టప్రకారం చర్యలు చేపట్టాలి.అధికారుల పనితీరులో పారదర్శకత కూడా అవసరం. ఎన్ని హోటళ్లను తనిఖీ చేశారు? ఎన్ని చోట్ల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు? ఎన్ని ఆహార నమూనాలను పరీక్షలకు పంపారు? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఫిర్యాదులు స్వీకరించేందుకు సులభమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, వాటిపై సకాలంలో విచారణ జరపాలి. సిబ్బంది కొరత లేదా ఇతర పరిపాలనా సమస్యలు ఉంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాల్లో బాధ్యతను ఒక శాఖ నుంచి మరో శాఖకు నెట్టివేయకుండా సమన్వయంతో పనిచేయాలి.ప్రజలకు కూడా ఆహార భద్రతపై అవగాహన అవసరం. హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం కనిపించినా, ఆహారం నాణ్యతపై అనుమానం కలిగినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. అయితే ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోతే వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. అందుకే ఫిర్యాదుదారులకు విచారణ పురోగతి, తీసుకున్న చర్యల వివరాలను తెలియజేసే విధానం ఉండాలి. అదే సమయంలో నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందించే వ్యాపారులను ప్రోత్సహించాలి. వ్యాపారులందరినీ అనుమానంతో చూడటం కాకుండా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆధారాలతో చర్యలు తీసుకోవడం సముచితం.హోటల్ వ్యాపారం అంటే కేవలం లాభాల ఆర్జన మాత్రమే కాదు; వినియోగదారుల ఆరోగ్యం పట్ల బాధ్యత కూడా. నాణ్యమైన ఆహారం అందించడం యాజమాన్యాల కర్తవ్యం అయితే, ఆ బాధ్యత సక్రమంగా నెరవేరుతోందో లేదో పర్యవేక్షించడం అధికారుల బాధ్యత. నర్సాపూర్ ఘటనను హెచ్చరికగా తీసుకొని జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్లక్ష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలి. ప్రజలకు కావాల్సింది ఘటన జరిగిన తర్వాత హడావుడి చేసే వ్యవస్థ కాదు.. ప్రమాదం జరగకముందే అప్రమత్తమయ్యే యంత్రాంగం. ఆహారం మనిషికి జీవనాధారం కావాలి తప్ప ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవడమే నిజమైన ఆహార భద్రత.

# పెరిగిన ధరలతో బతికేదెలా..?

మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఆహారధాన్యాల కొరత బాగా ఉండేది. అప్పట్లో విదేశాల నుంచి ఓడ వస్తే కానీ.. మనకు ఆహారధాన్యాల సరఫరా జరిగేది కాదు. అలా 2-3 దశాబ్దాల పాటు కష్టాలు పడిన తర్వాత.. హరిత విప్లవంతో మొత్తం కథే మారిపోయింది. అప్పట్నుంచీ ప్రకృతి విపత్తులు వచ్చినా కూడా ఆహారకొరత అనేది ఎప్పుడూ రాలేదు. చివరకు కరోనా లాంటి సంక్షోభం వచ్చినా.. మనకు నిత్యావసరాలకు కొరత రాలేదు. ఇటీవలి ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు కూడా మనపై పరోక్ష ప్రభావం చూపినా.. మొన్నటిదాకా ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండటం సామాన్యుడికి ఊరటనిచ్చింది. కానీ వీటన్నింటికీ మించి ఎల్‌నినో కొట్టిన దెబ్బతో.. జనం దిమ్మ తిరిగింది. అప్పటిదాకా అదుపులో ఉన్న నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా హై జంప్ చేశాయి. దీంతో ద్రవ్యోల్బణం కట్టుదాటి.. కొత్త రికార్డులకు చేరింది. ఇంకా దారుణంగా మునుపెన్నడూ లేని విధంగా పట్టణ ప్రాంతాలకు మించి గ్రామీణ ప్రాంతాల్లో ఆహారద్రవ్యోల్బణం కోరలు చాచింది. ఈ దెబ్బతో నిత్యావసరాల ధరలన్నీ బ్రేకుల్లేని కారుల్లా దూసుకుపోతున్నాయి. అసలే వేతనాలు పెరగక అల్లాడుతున్న సామాన్యుడికి.. ధరాఘాతం గట్టిగానే తగిలింది. అంతంతమాత్రం ఆదాయంలో ఎక్కువ శాతం నిత్యావసరాలకే ఖర్చైపోతోంది. ఇక మిగిలే అరకొరతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియక.. మధ్యతరగతి కూడా గుడ్లు తేలేసే దుస్థితి నెలకొంది.దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నప్పటికీ ద్రవ్యోల్బణం ఇప్పుడు ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఆహారం, ఇంధన ధరలు పెరగడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. ఆహార ధరల పెరుగుదల ఇప్పుడు మరిన్ని వస్తువులకు విస్తరిస్తోంది. మిడిల్ ఈస్ట్‌లో మరోసారి ఉద్రిక్తకర వాతావరణం నెలకొనగా.. ఇంధన ఉత్పత్తి, సరఫరాలకు అది ఆటంకంగా మారింది. దేశంలో నిత్యావసరాల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మొత్తం ద్రవ్యోల్బణం కంటే ఆహార ధరలు వేగంగా పెరుగుతున్నాయి. అనేక నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్న తరుణంలో, ఇది గృహ బడ్జెట్లపై ఒత్తిడిని పెంచుతోందని నిపుణుల చెబుతున్నారు. ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం సెప్టెంబర్ 2026 నాటికి దేశ ఆహార ద్రవ్యోల్బణం 7.74%కి చేరుకుంది. ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి, నిమ్మకాయలు, బియ్యం ధరలు పెరగడం వల్ల ఆహార ఖర్చులు పెరిగాయి. సవరించిన వినియోగదారుల ధరల సూచిక ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 4.82% నుంచి సెప్టెంబర్‌లో 5.54%కి పెరిగింది. మొదటిసారిగా 5% మార్కును దాటింది.నవంబర్‌లో మొత్తం ద్రవ్యోల్బణం 6.7%-6.8% వద్ద గరిష్ట స్థాయికి చేరుకుంటుందని ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా వేస్తోంది. గృహ ఖర్చులలో ఆహారం ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాలకు నిత్యావసర కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు పెరిగినప్పుడు కిరాణా సామానుపై ఎక్కువ ఖర్చు చేయవలసి రావచ్చు లేదా ఇతర వస్తువుల కొనుగోళ్లను తగ్గించుకోవలసి రావచ్చు. పెరిగిన ధరలకు ప్రతిస్పందనగా గృహాలు చౌకైన ప్రత్యామ్నాయాలకు మారడం, తక్కువ పరిమాణంలో కొనుగోలు చేయడం లేదా ఇతర ఖర్చులను తగ్గించుకోవడం వంటివి చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎస్‌బిఐ రీసెర్చ్ ప్రకారం ద్రవ్యోల్బణానికి వినియోగదారుల ధరల సూచీ అందించే మొత్తం వాటాలో 75% వాటా ఉన్న నిత్యావసర వస్తువుల సంఖ్య ఆగస్టులో 25 నుంచి సెప్టెంబర్‌లో 31కి పెరిగింది. ఇది ధరల ఒత్తిళ్లు విస్తృత శ్రేణి వస్తువులకు వ్యాపిస్తున్నాయని సూచిస్తుంది.

కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావాలు, పెరిగిన ఇంధన ధరలు నిత్యావసర వస్తువుల ధరలు ద్రవ్యోల్బణ అంచనాలకు ప్రమాదాలుగా ఉంటాయని ఎస్‌బిఐ రీసెర్చ్ గుర్తించింది. వాతావరణ పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తిని, కొన్ని ఆహార పదార్థాల లభ్యతను ప్రభావితం చేయగలని అంచనా వేస్తున్నారు. సరఫరా తగ్గితే, ధరలు మరింత పెరగవచ్చని నివేదిక పేర్కొంది. కానీ సమీప భవిష్యత్తులో సరఫరా పెరుగుదల సంకేతాలు కాకుండా.. తగ్గుదల సూచనలు రావడం.. రాబోయే ప్రమాదాన్ని కళ్లకు కడుతోంది.ఆహార ద్రవ్యోల్బణానికి తోడు పెరిగిన ఇంధన ధరలు, రవాణా ఖర్చులు కూడా వ్యవసాయ ఉత్పత్తులను, ఇతర వస్తువులను మార్కెట్‌లకు తరలించే వ్యయాన్ని పెంచడం ఖాయం. ఫలితంగా ధరలు మరింతగా పెరుగుతాయనే అంచనాలున్నాయి. ఇప్పటికే మార్కెట్లో రిటైల్ వ్యాపారులే.. రాబోయే రోజుల్లో ధరాభారం తప్పదని వినియోగదారుల్ని బెదరగొడుతున్నారు. ఇప్పటికే గరిష్ఠ స్థాయిలో ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ఇంకా పెరిగితే.. కుటుంబాలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ద్రవ్యోల్బణ గణాంకాలకు కొత్త విధానాన్ని కేంద్రం అనుసరిస్తోంది. ఈ సిరీస్ విడుదల తర్వాత ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 5.97% ఉండగా.. సెప్టెంబర్ నెలలో 7.74 శాతానికి చేరింది. గత ఏడాదితో పోలిస్తే బంగాళాదుంపలు 11.50 శాతం, టమాటాలు 8.62 శాతం తగ్గాయి కదా అని సరిపెట్టుకుందామంటే.. మిగతా నిత్యావసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఇక హెచ్చరించదగ్గ మరో డేంజర్ బెల్ ఏంటంటే.. పట్టణాల్లో ఇన్‌ఫ్లేషన్ 4.88 శాతంగా ఉంటే, పల్లెల్లో ఏకంగా 6.08 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు తక్కువ, ధరల భారం ఎక్కువై అక్కడ పేదలు అల్లాడిపోతున్నారు. జీతాలు పెరగడం లేదు కానీ.. నెలాఖరు వచ్చేసరికి నిత్యావసరాల బిల్లులు మాత్రం కొండలా పెరిగిపోతున్నాయి. పొదుపు చేసుకుందామన్నా పైసా మిగలని పరిస్థితి. పండగల సీజన్ దాటిన తర్వాత కూడా ఈ ద్రవ్యోల్బణం తగ్గకపోతే పరిస్థితి మరింత చేయిదాటిపోయే ప్రమాదం ఉంది.ధరలు పెరగడంతో గతంలో తక్కువ మొత్తంతో కొనుగోలు చేసిన సరుకులకే ఇప్పుడు ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబర్‌లో కొన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉల్లిపాయల వార్షిక ద్రవ్యోల్బణం 108.09 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 48.78 శాతంగా ఉంది. అలాగే వెల్లుల్లి ద్రవ్యోల్బణం 43.60 శాతం నుంచి 54.62 శాతానికి పెరిగింది. నిమ్మకాయల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. వీటి ద్రవ్యోల్బణం 15.15 శాతం నుంచి 36.41 శాతానికి చేరింది. అల్లం ద్రవ్యోల్బణం 62.85 శాతంగా నమోదైనప్పటికీ, ఆగస్టులో ఉన్న 73.82 శాతంతో పోలిస్తే తగ్గింది. మరోవైపు బంగాళాదుంపల ద్రవ్యోల్బణం -11.50 శాతంగా, టమాటాల ద్రవ్యోల్బణం -8.62 శాతంగా నమోదైంది. అంటే గత ఏడాదితో పోలిస్తే వీటి ధరలు తగ్గినట్లు అర్థం. కూరగాయల ధరల్లో ఈ మార్పులు ఉన్నప్పటికీ, ఉల్లిపాయలు, వెల్లుల్లి వంటి నిత్యావసరాల ధరల పెరుగుదల వంటింటి బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. ఏతావాతా ద్రవ్యోల్బణం గణాంకాలు.. క్షేత్రస్థాయి వాస్తవాల్ని ప్రతిబింబిస్తున్నాయి. మామూలుగా అయితే ద్రవ్యోల్బణం కట్టడికి ప్రభుత్వాలు చర్యలు తీసుకునే అవకాశం ఉండేది. కానీ సూపర్ ఎల్‌నినో రావడంతో.. సర్కారు తరపున తీసుకోగలిగిన చర్యల అవకాశాలు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో ఎవరికి వారే వచ్చే ఏడాది వరకూ తమ బడ్జెట్ ప్లాన్ చేసుకుని.. ఎవరి కష్టాలు వారు పడక తప్పదనే దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఎటుచూసినా కష్టాలే తప్ప.. ఎక్కడా ఊరటనిచ్చే పరిణామాలు కనిపించకపోవడం.. సామాన్యుల్ని మరింతగా కలవరపెడుతోంది. దీంతో ఇప్పుడే ఇలా ఉంటే.. ఎల్‌నినో మరింత ముదిరేకొందీ.. ఇంకా ఎలాంటి దుర్భర పరిస్థితులు చూడాల్సి వస్తుందోనని జనం ముందస్తుగానే భయపడుతున్నారు.తెలుగు రాష్ట్రాల్లో నాణ్యమైన సన్న బియ్యం కిలో రూ.100 పలుకుతోంది. మినపగుళ్లు, కందిపప్పు సహా అన్ని పప్పుల ధరలూ భగ్గుమంటున్నాయి. కూరగాయల ధరలూ మంటపుట్టిస్తున్నాయి. కూరగాయల ధరలు, సగటున 42 శాతం పెరిగాయి. పప్పులు, చిరుధాన్యాల రేట్లూ పెరిగాయి. ఇలా నిత్యావసరాల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. అదేమంటే ఎల్‌నినో ప్రభావం. పంట ఉత్పత్తుల కొరతనే సమాధానం. డెయిరీలు పాలధరల్ని లీటర్‌కు రూ.4 చొప్పున పెంచాయి. ఇలా బియ్యం, పప్పులు, నూనెల రూపంలోనే ఒక్కో కుటుంబంపై సగటున రూ.1200 వరకు అదనపు భారం పడుతోంది. ఒకవైపేమో జీతాలు పెరగడం లేదు. మరోవైపు మాత్రం...నిత్యావసరాల ధరలు మంట పుట్టిస్తున్నాయి. బియ్యం, నూనెలు, కందిపప్పు లాంటివి పోటాపోటీగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యుల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. కొత్త పంట పూర్తిగా రాకముందే బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణంగా ధాన్యం కోతలు అక్టోబర్, నవంబర్‌లో జరుగుతాయి. సంక్రాంతి వరకు పాత ధాన్యమే ఉపయోగిస్తారు. తెలంగాణ, ఏపీలో ఇంకా ఎక్కడా కొత్త పంట రాలేదు. అయినా ఏప్రిల్ నుంచే బియ్యం ధరల్లో పెరుగుదల మొదలైంది. ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు తగ్గుతుందని, ధాన్యం ఉత్పత్తి పడిపోతుందని అధికారులు అంచనా వేశారు. సన్నబియ్యం కొరత ఉంటుందనే ప్రచారంతో బియ్యం వ్యాపారులు ముందే రేట్లు పెంచేశారు. దీంతో అడ్డూ అదుపూ లేకుండా ధరలు రోజు రోజుకూ పరిగిపోతున్నాయి.కూరగాయల ధరలు ఎగసిపడుతున్నాయి. నెలక రోజుల క్రితం ధరలతో పోలిస్తే, నెల వ్యవధిలో 42 శాతం వరకు పెరిగాయి. ఎల్‌నినో ప్రభావంతో సాగు తగ్గింది. వేసిన పంట కూడా సెప్టెంబర్ నెలాఖరులో కురిసిన వర్షాలకు కొంతమేర దెబ్బతింది. దీంతో ధరల్లో పెరుగుదల మొదలైంది. ఆకుకూరల రేట్లూ దాదాపు రెట్టింపయ్యాయి. జీడిపప్పు, బాదం, ఎండుద్రాక్ష తదితరాల ధరలు కూడా కిలోకి రూ.100 వరకు పెరిగాయి. పప్పులూ ప్రియమయ్యాయి. ఈ ఏడాది పప్పుధాన్యాల సాగుపైనా ఎల్‌నినో ప్రభావం ఉంటుందనే అంచనాలతో వాటి ధరలూ ఇప్పటి నుంచే పెంచేశారు. కిలో కందిపప్పు రూ.150 దాటేసింది. గత నెలతో పోలిస్తే కిలోకి 10 రూపాయల నుంచి 15 రూపాయల వరకు పెరిగింది. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలన్నీ మండిపోతున్నాయి. ఏ వస్తువు కొందామన్నా ధరలు తారెత్తిస్తున్నాయి. ముఖ్యంగా బియ్యం, పంచదార, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటడంతో...సగటు కుటుంబం నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది. నిన్నటి దాకా నెలకు రూ. 3 వేలు అయ్యే సరకులకు ఇప్పుడు ఏకంగా రూ. 4 వేలు దాటుతోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్ దందా పెరగడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ధరాభారంతో సామాన్యులు నిత్యావసరాలను కొనలేకపోతున్నారు. కిలో కొనే చోట...అర కిలో మాత్రమే కొంటున్నారు. ఎల్‌నినో ఎఫెక్ట్‌తో భవిష్యత్‌లో పరిస్థితులు మరింత దారుణంగా ఉంటాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కొత్త ఊపిరి!

నగరాల అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణమే కాదు.. ప్రకృతి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కూడా. పెరుగుతున్న పట్టణీకరణతో చెరవులు కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కాప్రా చెరువు పునరుద్ధరణకు చేపట్టిన పనులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకప్పుడు పక్షుల కిలకిలరావాలతో, నీటి నిల్వలతో కళకళలాడిన ఈ చెరువుకు పూర్వ వైభవం తీసుకురావడానికి హైడ్రా చేస్తున్న ప్రయత్నాలు పర్యావరణ పరిరక్షణ దిశగా కీలక అడుగుగా నిలుస్తున్నాయి.కాప్రా చెరువు సాధారణ నీటి వనరు మాత్రమే కాదు.. నగర పర్యావరణ సమతుల్యతకు, జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో అవసరమైన వెట్‌ల్యాండ్. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఈ ప్రాంతం వలస పక్షులకు ఆవాసంగా నిలుస్తోంది. ఆస్ట్రేలియా, యూరప్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పక్షులకు అనుకూలమైన వాతావరణాన్ని అందించే ఈ చెరువు ప్రాధాన్యాన్ని గుర్తించి, దాని సహజ స్వరూపాన్ని కాపాడటం అత్యవసరం. చెరువులు నిండుగా ఉంటే భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల పర్యావరణ సమతుల్యతకు కూడా మేలు జరుగుతుంది.సుమారు 112.80 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం కలిగిన కాప్రా చెరువు అభివృద్ధికి దాదాపు రూ.35 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. హైడ్రా రెండో దశలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఇది ఒకటి. ఇప్పటికే సుమారు 60 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని తమ భూముల్లో సుమారు 70 ఎకరాలను అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా అప్పగించేందుకు స్థానిక రైతులు ముందుకు రావడం అభినందనీయం. ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ పరిణామం తెలియజేస్తోంది.చెరువుల పునరుద్ధరణలో ప్రధాన లక్ష్యం నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, వరద ముప్పును తగ్గించడం, భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం కావాలి. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు సక్రమంగా చెరవులోకి చేరేలా ఇన్‌లెట్, ఔట్‌లెట్ వ్యవస్థలను మెరుగుపరచడం అవసరం. పూడిక తొలగింపుతో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడం వల్ల పరిసర ప్రాంతాల్లో వరద సమస్యలను కొంతవరకు తగ్గించవచ్చు.

అయితే ఈ పనులన్నీ శాస్త్రీయ అధ్యయనాలు, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలి.కాప్రా చెరువు అభివృద్ధిలో సుందరీకరణతో పాటు సహజ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యం. చేపలు, జలచరాలు, ఉభయచరాలు, పక్షులు జీవించేందుకు అనువైన వాతావరణం కొనసాగాలి. నీటిలోకి మురుగునీరు, వ్యర్థాలు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. పూడిక తొలగింపు పేరుతో సహజ ఆవాసాలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు పాటించాలి. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఉపయోగకరమే అయినప్పటికీ, ఇవి పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించకుండా రూపకల్పన చేయాలి.చెరువుల పరిరక్షణలో మరో ముఖ్యమైన అంశం ఆక్రమణల నివారణ. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. చెరువు పరిధిని స్పష్టంగా గుర్తించి, నీటి ప్రవాహ మార్గాలను కాపాడాలి. కేవలం అభివృద్ధి పనులు పూర్తిచేయడం కాకుండా, వాటి నిర్వహణకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అవసరం. స్థానిక ప్రజలు, పర్యావరణ నిపుణులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఈ ప్రయత్నాలు దీర్ఘకాలిక ఫలితాలను అందిస్తాయి.కాప్రా చెరువు పునరుద్ధరణ విజయవంతమైతే అది స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన
వాతావరణాన్ని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. ఉదయం నడకకు వచ్చే వారు, సాయంత్రం కుటుంబాలతో గడిపే ప్రజలు, ప్రకృతిని ఆస్వాదించే పిల్లలకు ఈ ప్రాంతం ఉపయోగకరంగా మారుతుంది. అయితే ప్రజలు కూడా చెరువులో చెత్త వేయకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ తమ బాధ్యతను నిర్వర్తించాలి.చెరువును అభివృద్ధి చేయడం అంటే కేవలం అందంగా తీర్చిదిద్దడం కాదు.. ప్రకృతికి జీవం పోసి, భవిష్యత్తు తరాలకు నీటి వనరులను భద్రంగా అందించడం. కాప్రా చెరువు పునరుద్ధరణ పనులు అదే లక్ష్యంతో ముందుకు సాగాలి. ప్రభుత్వ సంస్థల కృషికి ప్రజల సహకారం తోడైతేనే చెరువులు మళ్లీ జీవకళను సంతరించుకుంటాయి. ప్రకృతిని కాపాడుకోవడమే మన భవిష్యత్తును కాపాడుకోవడం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

# జలమండలి పొదుపు చర్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎల్ నినో నేపథ్యంలో క్యూర్ పరిధిలో తాగునీటి సమస్యలు ముంచుకొస్తున్నాయి. దీంతో తాగునీటి సరఫరా, వినియోగంలో పొదుపు మంత్రం పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందకు జలమండలి చర్యలు చేపట్టనుంది. దీంతోపాటు జలమండలి సరఫరా చేస్తున్న నీటిని వృథా చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటూనే ప్రజల్లో అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనుంది. దీంతోపాటు పారిశ్రామిక, బల్క్ వినియోగదారులకు ప్రస్తుతం అందిస్తున్న నీటి పరిమాణం, సరఫరా విధానం, సంబంధిత జలవనరులను సమీక్షించనుంది. సింగూరు-మంజీరా కాంటింజెన్సీ అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే ఆయా సరఫరాలపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని జలమండలి భావిస్తోంది.

**రంగంలోకి సినీ నటులు, సెలబ్రిటీలు..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో ప్రజలు కేవలం 20 శాతం నీటిని పొదుపుగా వినియోగించినా రోజుకు 80 ఎంజీడీల నీటిని ఆదా చేయడానికి అవకాశముందని జలమండలి అంచనా వేసింది. జలమండలి సరఫరా చేసే తాగునీటితో వాహనాలను కడగడం, నీటిని వృథా చేయడం వంటి చర్యలను కట్టడి చేయాలని అధికారులు నిర్ణయించారు. నీటి పొదుపు, వృథా నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 60 రోజుల పాటు విస్తృత సా-ౖయిలో ప్రచార, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో సినిమా నటులు, ప్రముఖులు, సెలబ్రిటీలను భాగసా-ౖములను చేసి ప్రజలను చైతన్యవంతం చేయనున్నారు.

**576 ఎంజీడీల నీటి సరఫరా ఇలా..**

జలమండలి పరిధిలో ఉన్న 14లక్షల నీటి కనెక్షన్లకు గాను జలమండలి 576 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తోంది. అయితే సింగూరు రిజర్వాయర్ నుంచి 69.50 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే డ్యామ్ మరమ్మతుల కారణంగా ఇరిగేషన్ అధికారులు నీటి నిల్వలను తగ్గించాలని నిర్ణయించారు. దీంతోపాటు ఎల్లంపల్లి నుంచి రోజుకు 162ఎంజీడీ నీటిని సేకరిస్తున్నారు. అయితే డిసెంబర్ వరకు రెగ్యులర్ 160ఎంజీడీ నీటిని సేకరించడానికి ఎలాంటి సమస్యలేదని అధికారులు చెబుతున్నారు. కృష్ణానది అక్కంపల్లి నుంచి 270ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక ఉస్మాన్‌సాగర్ 22.70, హిమాయత్ సాగర్ 12.80, మంజీరా నుంచి 39.50 ఎంజీడీల నీటి సరఫరా చేస్తున్నారు.

**రోజుకు 5 వేల ట్యాంకర్లు..**

క్యూర్ పరిధిలో 14 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వీటికిగాను ప్రతిరోజూ జలమండలి 575 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నది. అయితే వర్షాలు రాకపోవడంతో జలమండలి సరఫరా చేస్తున్న నీటిపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతోపాటు ట్యాంకర్లకు సైతం భారీగానే డిమాండ్ పెరుగుతోంది. సాధారణంగా జూన్, జులై మాసాల్లో ట్యాంకర్ల బుకింగ్స్ 5వేల లోపే ఉండాల్సింది. దీంతోపాటు వర్షాకాలంలో 2,500లోపు ట్యాంకర్ల బుకింగ్ ఉండాల్సింది. కానీ 5వేలకుపైగా బుక్ చేస్తున్నారంటే ఎల్ నినో ఎఫెక్ట్ ఏ స్థాయిలో ఉందో చెప్పనక్కర్లేదు. ట్యాంకర్ల బుకింగ్ ఇలాగే కొనసాగితే నీటి కొరత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**60 ఎంజీడీలకు ప్రణాళిక..**

హైదరాబాద్ కోర్ ఏరియాకు ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి నదుల ద్వారా 576 ఎంజీడీల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృష్ణా నది నుంచి అదనంగా 15 ఎంజీడీలు, మిషన్ భగీరథ ద్వారా 20 ఎంజీడీలతోపాటు అదనంగా మరో 20 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్, హిమాయ-త్‌సాగర్‌ల నుంచి మరో 5 ఎంజీడీల చొప్పున మొత్తం 60 ఎంజీడీల అదనపు నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. మల్లన్నసాగర్‌లో 5 టీఎంసీల నీరు అందుబాటులో ఉండడంతోపాటు అక్కడి నుంచి నగరానికి నీటిని తరలించే పైప్‌లైన్ నిర్మాణం నవంబర్‌లో పూర్తికానున్నందున అదనంగా 20 ఎంజీడీల నీటిని వినియోగించుకునే చర్యలను వేగవంతం చేయాలని జలమండలి భావిస్తోంది.

## మూడు దశల్లో బీఎస్-7 అమల్లోకి..

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా వాహన కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా వచ్చే కార్లు, ఎస్‌యూవీ ల కోసం మరింత కఠినమైన 'భారత్ స్టేజ్-7 ఉద్గార ప్రమాణాలను తీసుకురావడానికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలను 2029 ఏప్రిల్ 1 నుంచి 2035 ఏప్రిల్ 1 వరకు ఆరేళ్ల కాల వ్యవధిలో మూడు విడతలుగా అమలు చేయనున్నట్లుగా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అందులో మొదటి దశ ఏప్రిల్ 2029 నుంచి, రెండో దశ ఏప్రిల్ 2031 నుంచి, మూడో దశ ఏప్రిల్ 2035 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ప్రస్తుత వాహనదారులకు నో ప్రాబ్లం..**

నైట్రోజన్ ఆక్సైడ్స్, హైడ్రోకార్బన్లు, పార్టిక్యులేట్ మేటర్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ బీఎస్-7 నిబంధనలను రూపొందించారు. అయితే, ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న వాహనాలకు గానీ, బీఎస్-6 ప్రమాణాలు కలిగిన వాహనాల జీవితకాలానికి గానీ ఎలాంటి ముప్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. కాగా, దేశంలో కాలుష్య నివారణను వేగవంతం చేసేందుకు భారత్ గతంలో 'బీఎస్-5'ను దాటవేసి నేరుగా 'బీఎస్-6' నిబంధనలను ఏప్రిల్ 2020 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

# ఏటా రైతులకు తప్పని పంట కష్టాలు!

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆ ప్రాంత అన్నదాతల సాగునీటి కలలను సాకారం చేయాల్సిన సాగునీటి ప్రాజెక్టు.. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతతో అన్నదాతల పాలిట శాపంగా మారింది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రాంతంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన జగన్నాథ్‌పూర్(పెద్దవాగు) మధ్యతరహా ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు పనులు 85శాతం పూర్తయినప్పటికీ కేవలం కాల్వల నిర్మాణం, భూసేకరణకు అవసరమైన అరకొర నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు రైతులకు ఉపయోగపడకుండా పోతోంది. ఫలితంగా ఏటా వర్షాకాలంలో వచ్చే వరద నీరంతా జలాశయంలో నిల్వ ఉండకుండా వృథాగా ప్రాణహిత నది పాలవుతోంది. బడ్జెట్‌లో ఏటా నిధుల కేటాయింపుల్లో సర్కారు మొండిచేయి చూపుతుండడంతో ఆసిఫాబాద్ జిల్లాలో రెండో మధ్యతరహా ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన ఈ పథకం అసంపూర్తిగానే మిగిలిపోయింది.

**20 ఏళ్లుగా తీరని నిరీక్షణ.. రెట్టింపైన నిర్మాణ వ్యయం**

ఏఐబీపీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో 2006లో ఈ ప్రాజెక్టును మంజూరు చేశారు. నాటి అంచనా వ్యయం రూ.124.64కోట్లు కాగా, నిర్మాణ పనులను కాంట్రాక్టర్ రూ.118.80 కోట్లకు దక్కించుకున్నారు. ఒప్పందం ప్రకారం కేవలం రెండేళ్లలోనే పనులు పూర్తి చేసి రైతులకు నీరివ్వాల్సి ఉండగా.. కాలయాపన, నిధుల విడుదలలో ప్రభుత్వాల జాప్యం కారణంగా పనులు సాగలేదు. దీంతో నిర్మాణ అంచనా వ్యయం కాస్తా రూ.250కోట్లకు రెట్టింపైంది. పెద్దవాగుపై 1.05 కిలోమీటర్ల పొడవైన ఆనకట్టను నిర్మించి, ఇరువైపులా తూములు ఏర్పాటు చేసి ప్రధాన కాల్వల ద్వారా 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించడమే దీని ప్రధాన లక్ష్యం.

**రూ.185 కోట్లు ఖర్చు పెట్టినా అటకెక్కిన కాల్వలు..**

ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు మొత్తం రూ.185కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.108కోట్లు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.77కోట్లు ఇచ్చింది. ప్రధాన డ్యామ్ సహా 85 శాతం మేర కీలక పనులు పూర్తయ్యాయి. అయితే మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో 80 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణ, కాల్వల అనుసంధానానికి సుమారు రూ.20 కోట్ల నిధులు అవసరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**కనీసం రూ.10కోట్లైనా ఇవ్వండి..**

ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన పనులు ముగింపు దశకు చేరినందున, ప్రభుత్వం కనీసం రూ.10 కోట్ల తక్షణ నిధులు విడుదల చేసినా పనులు వేగవంతం చేసి కొంతమేరకైనా ఆయకట్టుకు నీరందించవచ్చని నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి పదేపదే నివేదికలు పంపారు. అయినప్పటికీ సర్కారు నుంచి ఎలాంటి ఆర్థిక ఆమోదం లభించకపోవడంతో ఆ ప్రాంత రైతులు సాగునీటి కోసం వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు కోట్ల రూపాయల విలువైన ప్రాణహిత జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నాయి.

# ఫిట్‌నెస్ ఛాలెంజ్ స్వీకరించిన పొన్నం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిట్ నెస్ ఛాలెంజ్ లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ విసిరిన ఖేలో తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ స్వీకరించిన మంత్రి.. 2026 అక్టోబర్ 15న మరో 9 మందికి ఛాలెంజ్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడిన మంత్రి.. క్రీడా మైదానాల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాలు నడక, పరుగు, సైక్లింగ్, యోగా లేదా తమకు అనువైన శారీరక వ్యాయామం కోసం సమ-యం కేటాయించాలని సూచించారు. శారీరక దృఢత్వం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ, సామాజిక శ్రేయస్సుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తమ వ్యాయామానికి సంబంధించిన 27 సెకన్ల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని, తొమ్మిది మంది మిత్రులను ట్యాగ్ చేశారు. మరో తొమ్మిది మందిని ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాలని కోరారు. ఈ విధంగా ప్రతి ఒక్కరూ భాగసా-ౖములైతే ఫిట్‌నెస్ ఉద్యమం ప్రజల్లోకి విస్తృతంగా చేరుతుందని అన్నారు.

**ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్**

ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయడంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ కార్యదర్శి, డీజీపీ సీవీ ఆనంద్ ,టీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, వెల్ఫేర్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా లకు ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.క్రీడలు కేవలం పోటీలు, పతకాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో, ప్రతి విద్యాసంస్థలో క్రీడా సంస్కృతి పెంపొందాలని మంత్రి ఆకాంక్షించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శారీరక వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు.

**బీసీ విద్యాసంస్థల్లో ఫిట్‌నెస్ కార్యక్రమాల విస్త-రణ**

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్ని విద్యాసంస్థల్లో ఖేలో తెలంగాణ బంధన్, ఫిట్‌నెస్ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేసే దిశగా చర్యలు చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమిచ్చేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు కన్నం మధు, సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ డైరీ దందా గుట్టురట్టు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని డైరీ ప్రొడక్ట్స్ తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ , ఫుడ్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. క్వాలిటీని గాలికొదిలేసి నాసిరకం ఉత్పత్తులను విక్రయిస్తున్న డైరీ సంస్థల తీరు ఈ తనిఖీల్లో వెలుగుచూసింది. మధుర, యశోద, బాలాజీ, జగన్నాథ్ డైరీ ప్రొడక్ట్స్ కేంద్రాలపై అధికారులు ముమ్మరంగా సోదాలు జరిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల మొత్తం 6 డైరీ యూనిట్లు, ఒక ట్రాన్స్‌పోర్ట్ కేంద్రంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సోదర్లలో అపరిశుభ్ర వాతావరణంలో డైరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తేలింది. ఎలాంటి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఈ యూనిట్లు నడుస్తున్నట్లు గుర్తించారు. సరైన నిల్వ వసతులు లేకపోవడంతో పాటు, ఉష్ణోగ్రత నియంత్రణ పాటించకుండా డైరీ ప్రొడక్ట్స్‌ను నిల్వ చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్ వాహనాలను ఉపయోగించకుండా, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి బస్సులు, డీసీఎంల ద్వారా హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న 3.6 టన్నుల కల్తీ కోవాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు డైరీ యూనిట్లను సీజ్ చేయడంతో పాటు, మరికొన్నింటికి షోకాజ్ మరియు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

# తప్పు మీది.. నెపం అధికారుల మీదా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తప్పు తాము చేసి, ఆ నెపాన్ని అధికారులపై నెట్టడం సీఎం, మంత్రులకు పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. 'ప్రజలు, ఉద్యోగులు మీ ఉద్యోగాలు ఊడగొడుతారు చూస్కో రేవంత్' అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

**విద్యుత్ సంక్షోభానికి కారణం ప్రభుత్వ వైఫల్యమే..**

రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు కూడా పెట్టుకోకుండా, ఎలాంటి సమీక్షలు నిర్వహించకుండా విద్యుత్ రంగాన్ని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఆ నెపమంతా అధికారులపై మోపి, తాము మాత్రం శుద్ధపూసలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత 9 నెలలుగా ఎల్‌నినో ప్రభావం గురించి వాతావరణ శాఖ, శా-స్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నప్పటికీ.. ఈ ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రలో ఉండిపోయిందని హరీశ్ రావు విమర్శించారు. ఇప్పుడేమో కరెంట్ కోతల తర్వాత, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఇప్పుడు నిద్రలేచి అధికారులను సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నిషేధిత భూముల నుంచి కరెంట్ సంక్షోభం వరకు అదే తీరు..**

నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో తప్పు చేసింది ప్రభుత్వమే అయినప్పటికీ.. అధికారుల మీద నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశారని, ఇప్పుడు కరెంట్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని మారుస్తున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎల్‌నినోను కోవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపై స్పందిస్తూ.. 'ఈ రెండింటికంటే మించిన విపత్తు మీ పాలన అని ఎందుకు గుర్తించడం లేదు?' అని నిలదీశారు. అధికారుల ఉద్యోగాలు పీకేస్తామని హెచ్చరిస్తున్న రేవంత్ రెడ్డి.. ప్రజలు, అధికారులు కలిసి నీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలని హరీశ్ రావు తీవ్రంగా హెచ్చరించారు.

# సిక్కిం గవర్నర్ నియామకం రచ్చరచ్చ..

**ఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లో సెన్సేషనల్ అయిన అంకిత భండారి హత్య కేసులో న్యాయం కోర-ుతూ ఆమె తల్లిదండ్రులు నిన్న అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఢిల్లీలోని ఇండియా గేట్ సమీపంలో చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ కుమార్ గౌతమ్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ వారు రాత్రి మొత్తం నిరసన దీక్ష చేపట్టగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

**తల్లిదండ్రుల డిమాండ్ ఇదే..**

అయితే, కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేత దుష్యంత్ కుమార్ గౌతమ్ సీబీఐ విచారణ పూర్తికాకుండా ఎలాంటి ఉన్నత పదవుల్లోనూ కొనసాగరాదని అంకిత తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించడాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని వార్నింగ్ ఇచ్చారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు కూడా పాల్గొని మద్దతు తెలిపారు. గవర్నర్‌గా ఉన్న వ్యక్తిపై క్రిమినల్ విచారణ జరపడం సాధ్యం కాదనే ఉద్దేశంతోనే ఆయనకు ఈ పదవి కట్టబెట్టారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను దుష్యంత్ కుమార్ గౌతమ్ తీవ్రంగా ఖండించడంతో పాటు పరువు నష్టం దావా కూడా వేశారు.

**అంకిత భండారి హత్య కేసు నేపథ్యం ఇలా..**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం రిషికేశ్‌లోని ఓ రిసార్ట్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న 19 ఏళ్ల అంకిత భండారి 2022, సెప్టెంబర్ 18న హత్యకు గురయ్యారు. ఆమె డెడ్‌బాడీని నాలుగు రోజుల తర్వాత ఓ కాలువ నుంచి పోలీసులు బయటకు తీశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రిసార్ట్ యజమాని మాజీ బీజేపీ నేత వినోద్ ఆర్య కుమారుడు పుల్కిత్ ఆర్య సహా మరో ఇద్దరికి కోర్టు ఇప్పటికే జీవిత ఖైదు విధించింది. అయితే, ఈ కేసులో మరో అజ్ఞాత వీఐపీ ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలు రావడంతో గత ఏడాది డిసెంబర్‌లో అంకిత తల్లిదండ్రులు దుష్యంత్ కుమార్ గౌతమ్ పేరును తెరపైకి తీసుకొచ్చారు.

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

**ఢిల్లీ :** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. 'సర్' రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది. అయితే రాహుల్ గాంధీ పాదయాత్రగా వెళ్లి పిటిషన్ వేయడంపై కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. "మేము వాస్తవ ప్రపంచానికి అతీతులం కాదు. మాకు అన్ని విషయాలూ తెలుసు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలే-రు." అని వ్యాఖ్యానించారు.సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపు నిర్వహించడాన్ని సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించి, ఒత్తిడి తెచ్చే ప్రయ-త్నంగా అభివర్ణించారు. న్యాయవాది వ్యాఖ్యలకు ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని.. ఇటువంటి ప్రయత్నాలు చాలా బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని సూర్యకాంత్ అన్నారు. తాము వాస్తవ ప్రపంచానికి దూరంగా కూర్చోలేదని.. తమకు అన్నీ తెలుసని చెప్పారు.ఇక జంతర్ మంతర్ విషయమై సుప్రీంకోర్టు ఆదేశం మే-రకు దానిని నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించలేదని ఎస్జీ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఒక కమిటీ ఆ సూచన చేసిందని తెలిపారు. నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు నోటీసు జారీ చేసింది. తాము ముందుగా ప్రభుత్వ స్పందనను వింటామని, సంతృప్తి చెందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు పేర్కొంది.

# సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 10న జరిగిన భారీ నిరసనలు, ఆందోళనకారుల నిర్బంధంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత నిరసనకారులు , జర్నలిస్టులు, న్యాయవాదులపై పోలీసుల దాడులు, అక్రమ నిర్బంధాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. నిరసనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ దృశ్యాలను తక్షణమే భద్రపరిచి న్యాయస్థానానికి సమర్పించాలని అన్ని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. అలాగే జంతర్ మంతర్‌ను నిరసన వేదిక జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆందోళనకారుల ప్రాథమిక హక్కుల వాదనపై ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రభుత్వానికి తమ స్వరం వినిపించాలనే ఆలోచనను నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కూడా సాకారం చేసుకోవచ్చు" అని జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం వ్యాఖ్యానించింది.మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, 'ఇండియా' కూటమికి చెందిన 13 మంది అగ్రనేతలు ఈసీఐ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఓట్ల తొలగింపును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు న్యాయస్థానం నోటీసులు పంపింది. అయితే, ఈ పిటిషన్ వేసిన 13 మంది ఇండియా కూటమి నేతల్లో ఒకరి ప్రవర్తనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సదరు పిటిషనర్ ప్రవర్తనపై వివరణ కోరతామని స్పష్టం చేస్తూనే, ఓటర్ల జాబితా అక్రమాలపై ఈసీఐ తన స్పందనను తెలియజేయాలని ఆదేశించింది.

# గూడూరులో అబ్దుల్ కలాం జయంతి



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వాకర్స్ సభ్యులందరూ ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత జాతికి ఆదర్శ ప్రాయమైన ఆయన జీవిత చరిత్ర నెమరు వేసుకుని అబ్దుల్ ఆశయాలకై ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని తెలిపారు వాకర్ సభ్యులతో పాటు నిత్యం వాకింగ్ చేస్తూ అందరికి స్ఫూర్తిగా నిరుస్తున్న వయో వృద్ధురాలు సరోజనను పూలమాల బోకే అందజేసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముక్తవరం సత్యనారాయణ. ఉపాధ్యక్షులు మండల వెంకటేశ్వర్లు. కార్యదర్శి నునవత్ వీరన్న. గౌరవ సలహాదారులు సంఘపు స్వామి కన్న వెంకటేశ్వర్లు. ఐలబోయిన వీరయ్య. బుర్రి కొమురయ్య. బట్టు సారయ్య. సభ్యులు ధోని యాదగిరి. సయ్యద్ కరీం. మడిపెది భాస్కర్. మచ్చిక మొగిలి. మండల మల్లేష్. వడ్డోజు రాజలింగ చారి. బుర్క సత్యం. తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లిలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

## ఆరుతడి పంటల సాగుతో రైతులకు మేలు - ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** చింతపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఎఫ్‌పీఓ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.

**ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి: ATMA చైర్మన్**

ఈ సందర్భంగా ATMA చైర్మన్ అంగిరేకుల నాగభూషణం మాట్లాడుతూ, రైతులు అందించిన విత్తనాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన దిగుబడులు సాధించేలా సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి: సహాయ వ్యవసాయ సంచాలకులు దేవరకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలక్ష్మి మాట్లాడుతూ, రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

**రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే బాలునాయక్**

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పంటకు బదులుగా వే-రుశనగ, మినుములు, పెసర, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చే

శారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి, ఎఫ్‌పీఓ సీఈఓ మల్లేష్, ఏఈఓలు మౌనిక, అనంతలక్ష్మి, శ్రీలత, ఆంజనేయులు, మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

# కలాం జీవితం స్ఫూర్తిదాయకం



**మహబూబ్ నగర్ జిల్లా/ జడ్చర్ల ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్ర-పాయమని, స్ఫూర్తిదాయకమని ప్రజా, కుల సంఘాల నాయకులు కొనియాడారు. జడ్చర్ల ఎం ఆర్ సి భవన్‌లో ఫకీర్ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఫకీర్ జహంగీర్ పాషా ఆధ్వర్యంలో, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ చైర్మన్, క్రమశిక్షణ కమిటీ డాక్టర్ రమేష్ నాయక్ అధ్యక్షతన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. భారతదేశాన్ని శాస్త్రసాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపిన మహనీయుడికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని, అన్ని నియోజకవర్గాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, రజక సంఘం జాతీయ అధ్యక్షుడు నడుమింటి శ్రీనివాస్, సి హెచ్ ఓ రాములు నాయక్, మాజీ ఎంపీటీసీ బాలవర్ధన్ గౌడ్, సీపీఎం కార్యదర్శి తెలుగు సత్తయ్య, సీపీఐ నాయకుడు బాగి కృష్ణ యాదవ్, ఎం ఆర్ పి ఎస్ నాయకుడు బిక్షపతి, బీసీ జాగృతి సేన నాయకులు గోపాల్, రాఘవేంద్ర, ఫకీర్ మౌలాలి షా, ఫకీర్ ఉసేన్ షా, ఫకీర్ హుస్సేన్ షా, బేడా బుడగ జంగం సభ్యులు పొన్నకంటి జనార్దన్, రంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మురళి నాయక్ కు ఫోటో ఫ్రేమ్ అందజేసిన బుడిగే సతీష్ గౌడ్



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బుడిగే సతీష్ గౌడ్. హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయకును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి తను ప్రత్యేకంగా తయారు చేయించిన ఫోటో ఫ్రేమను అందజేయడం జరిగింది. ఆ ఫోటో ఫ్రేమ్ ఎమ్మెల్యే అత్యంత ఆసక్తికరంగా చూసి మంత్రముగ్ధులై బుడిగే సతీష్ గౌడ్ ను ఉద్దేశించి ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లి ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ఆయనకు భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాశిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.32 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులు**





**రామచంద్రాపురం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ నిధులతోపాటు సంస్థల సహకారంతో పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాశిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ. 32 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు అదనపు తరగతి గదుల పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతోపాటు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిధులతోపాటు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, రౌండ్ టేబుల్ ఇండియా సైబరాబాద్ వన్ చైర్మన్ ప్రశాంత్, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, రాజు, సంస్థ ప్రతినిధులు లక్ష్య జైన్, నిర్మల్ గుప్తా, ఆనంద సాగర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా పోటీలు ప్రారంభించిన ఎస్సై



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలను గ్రామంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. క్రీడా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరిక దారుఢ్యం ఏర్పడతాయని పోటీలలో గెలుపోటములు సహజమని ఓటమిలను విజయానికి మలుపుగా మలుచుకొని జీవితంలో ఎదగాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనితనర్సింగ్ యాదవ్, యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి, ఎడవెల్లి మల్లేశం, మాజీ అధ్యక్షులు బైరు సైదులు, కలుకూరి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు నాగిళ్ళ రాము, బూడిద రాజు, ఉపాధ్యక్షులు పరకాల దశరథ, మల్లం ఉపేందర్, చెవ్వ పవన్, సూరబోయిన దయాకర్, కోశాధికారి మల్లం సాయి, ప్రధాన కార్యదర్శులు బోదాసు రాజు, క్రీడ కార్యదర్శులు పరకాల కిషోర్, మల్లం చంద్రమౌళి, ఎడవెల్లి వెంకటేశం, తక్కళ్ల సురేష్, కార్యదర్శులు బద్దుల ప్రశాంత్, సలహాదారు ఇంజమూరి శేఖర్, ఎడవల్లి విజయ్, పిట్టల నరేష్, నిమ్మల శేఖర్, కూచిమల్ల రాము, యూత్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు సర్పంచ్ దంపతులకు సత్కారం



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రుగూడెంలో గడిల లావణ్య కార్తీక్. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాన్ని కొబ్బరికాయ కొట్టు రిబ్బన్ కాటు చేసి ప్రారంభించిన సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఇల్లు దంపతులు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గృహప్రవేశానికి విచ్చేసిన సర్పంచ్ దంపతులకు శాలువా చీరే సారేతో మర్యాదపూర్వకంగా సత్కరించారు.

# పోలీస్ కార్యాలయ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



**పెద్దపల్లి జిల్లా,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పోలీస్ శాఖలో సమర్థవంతమైన పాలనకు రికార్డుల నిర్వహణ, సమాచార నిక్షిప్తం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కీలకమని కాళేశ్వరం మల్టీజోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ అన్నారు. గురువారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించి, వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన డీఐజీ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. పోలీస్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

**వివిధ విభాగాల పనితీరుపై సమీక్ష**

జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ నేరాల వివరాలు, కేసుల రికార్డులు, నేరస్థుల డేటా, పెండింగ్ కేసులకు సంబంధించిన రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏ, బీ సెక్షన్లు, ఫింగర్‌ప్రింట్, డీ4సీ, కమాండ్ కంట్రోల్ విభాగాలను సందర్శించి అక్కడి విధుల నిర్వహణ, రికార్డుల భద్రత, కార్యాలయ పనితీరును సమీక్షించారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు నవీకరించి భద్రపరచాలని అధికారులకు సూచించారు. కేసులకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేసి, అవసరమైన సమయంలో తక్షణమే అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ డేటా నిర్వహణలో నాణ్యత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. పెండింగ్ రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, కార్యాలయాల్లో క్రమశిక్షణ, పరిశుభ్రతతో పాటు ఫైళ్లు, రికార్డుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు.

**పోలీస్ ఉద్యోగార్థులకు డీఐజీ దిశానిర్దేశం**

అనంతరం ఉచిత పోలీస్ నియామక శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా, అక్కడ శిక్షణ పొందుతున్న 160 మంది అభ్యర్థులతో మాట్లాడారు. వారి శిక్షణ, పరీక్షలకు చేస్తున్న సన్నద్ధత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో కష్టపడి చదవాలని, పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్, ఏఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఐపీఎస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్), జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రేగోడ్‌లో 33 మంది రక్తదానం

## ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**మెదక్ జిల్లా/రేగోడు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని రేగోడ్ మండల కేంద్రంలో నోబుల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 33 మంది యువకులు, గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సంరద్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పర్వీన్ సుల్తానా చోటు మియా, పిసిసి సభ్యులు మున్నూరి కిషన్, ఎస్ఐ పోచయ్య, బీఆర్ఎస్ నాయకులు రాచోటి సుభాష్, గొల్ల నర్సింలు, సుంకె రమేష్, మాజీ ఎంపీటీసీ అనిత రామగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిదిరె కృష్ణ, శంకరప్ప, మరియు సంతోష్ రావు శ్యాంరాయినొల్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ.. "రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ప్రాణాపాయంలో ఉన్న ఎంతోమందికి ఇది పునర్జన్మను ఇస్తుందని" తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల్లో రేగోడ్ యువత ఎల్లప్పుడూ ముందుండడం అభినందనీయ-ంమని వారు కొనియాడారు. కార్యక్రమం ముగింపులో రక్తదానం చేసిన 33 మంది దాతలకు, శిబిరానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు, వివిధ పార్టీల రాజకీయ నాయకులకు, ప్రెస్ మీడియా సభ్యులకు నోబుల్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



# అభిషేక్ శర్మ సరికొత్త ప్రపంచ రికార్డు

హైదరాబాద్ లోని ఉప్పల్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారీ స్కోర్ చేదనలో భారత జట్టు పోరాడి ఓడిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచులో భారత యువ ఓపెనర్, విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా టీమిండియా స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డు ను అభిషేక్ అధిగమించాడు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో షమర్ స్ప్రింగర్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో ముందుకు వచ్చి బాదిన భారీ సిక్సర్‌తో.. 2026 క్యాలెండర్ ఇయర్‌లో తన సిక్సర్ల సంఖ్యను 69కి చేర్చాడు. గతంలో 2022లో సూర్యకుమార్ యాదవ్ 68 సిక్సర్లతో నెలకొల్పిన రికార్డును అధిగమించి, ఫుల్ మెంబర్ దేశాల విభాగంలో నయా వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఈ ఏడాది ఆరంభం నుంచే అభిషేక్ శర్మ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తూ సిక్సర్ల వర్షం కురిపిస్తున్నాడు. న్యూజిలాండ్‌పై నాగ్‌పూర్‌లో 35 బంతుల్లో 8 సిక్సర్లతో 84 పరుగులు, గౌహతిలో కేవలం 20 బంతుల్లో 5 సిక్సర్లతో అజేయంగా 68 పరుగులు బాది తన పవర్‌హిట్టింగ్‌ను నిరూపించుకున్నాడు. ఇండోర్ వేదికగా జరిగిన మూడో టీ20లో 5 సిక్సర్లతో సూర్యకుమార్ 68 సిక్సర్ల రికార్డును సమం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్, హైదరాబాద్ మ్యాచ్‌లో మరో సిక్సర్‌తో అగ్రపీఠాన్ని కైవసం చేసుకున్నాడు. 2025లోనూ 54 సిక్సర్లు కొట్టిన అభిషేక్, ప్రస్తుతం టాప్ రికార్డుల్లో రెండు స్థానాలను ఆక్రమించి తన హవా చాటాడు. భారత టాప్ ఆర్డర్‌లో దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను వణికిస్తున్న అభిషేక్ శర్మపై క్రీడా విశ్లేషకులు, అభిమానులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# చీఫ్ సెలెక్టర్ రేసులో కొత్త ట్విస్ట్..



భారత క్రికెట్ నియంత్రణ మండలి జాతీయ ఎంపిక కమిటీలో మాజీ ఛీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వైదొలిగిన తర్వాత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వెస్ట్ జోన్ నుంచి ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు దరఖాస్తుల గడువు ముగిసినప్పటికీ, ఆ పదవికి సరిపోతారని భావించిన మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ దరఖాస్తు చేయలేదు. పార్థివ్ రేసు నుంచి తప్పుకోవడంతో, బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వివిఎస్ లక్ష్మణ్ ప్రభావం ఎంపిక ప్రక్రియలో మరింత పెరిగే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. దీనితో పాటు మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజానే తాత్కాలిక ఛీఫ్ సెలెక్టర్‌గా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ ఉన్నందున అగార్కర్ కొనసాగాలని బీసీసీఐ భావించినప్పటికీ, సమీకరణాలు మారడంతో కొత్త వ్యూహాలను పరిశీలించాల్సి వస్తోంది. కొత్త ఛీఫ్ సెలెక్టర్ వస్తే వారి ఆలోచనా విధానం ప్రస్తుతం ఉన్న సెలెక్టర్లతో విభేదించే అవకాశం ఉన్నందున, లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రస్తుత కమిటీనే ముందుకు తీసుకెళ్లడం మంచిదని బోర్డు భావిస్తోంది. వెస్ట్ జోన్ ప్రతినిధిగా కేవలం ఒక సెలెక్టర్‌ను మాత్రమే నియమించి, ఓజా నేతృత్వంలోనే ఈ ప్రక్రియను కొనసాగించే ఆలోచనలో బిసిసిఐ ఉంది. మరోవైపు అంతర్జాతీయ అనుభవం ఉన్న ప్రముఖ మాజీ క్రికెటర్లను ఎంపిక కమిటీలోకి తీసుకునేందుకు బీసీసీఐ తమ వేతన బడ్జెట్‌ను పెంచడానికి సిద్ధపడింది. ప్రజ్ఞాన్ ఓజా, ఆర్పీ సింగ్ చేరినప్పటి నుంచి ఎంపిక కమిటీ వార్షిక బడ్జెట్ గణనీయంగా పెరగ్గా, 2026-27 సంవత్సరానికి బడ్జెట్‌ను రూ. 19.35 కోట్లకు పెంచారు. దాదాపు 100 టెస్టులు ఆడిన ప్రముఖుల కోసం బిసిసిఐ ప్రయత్నించినప్పటికీ వారు ఆసక్తి చూపకపోవడంతో, ప్రస్తుతం ఉన్న అభ్యర్థులతోనే సంప్రదింపులు జరుపుతున్నారు. చివరికి పూర్తిస్థాయి ఛీఫ్ సెలెక్టర్‌ను నియమిస్తుందో లేదా ఓజాతోనే ముందుకు వెళ్తుందో వేచి చూడాల్సి ఉంది.

# బీసీసీఐ నాకు ప్రాణం పోసింది..



ప్రపంచ క్రికెట్‌లో 'యూనివర్స్ బాస్'గా గుర్తింపు తెచ్చుకున్న వెస్టిండీస్ విధ్వంసకర ఓపెనర్ క్రిస్ గేల్ తన కష్టకాలంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి అందించిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ ప్రకటన చేశారు. 2009వ సంవత్సరంలో తాను తీవ్రమైన వెన్నునొప్పితో కెరీర్ ముగిసిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొన్న సమయంలో బీసీసీఐ తనకు పునర్జన్మ నిచ్చిందని గేల్ వెల్లడించారు. ఆ సమయంలో అత్యవసరంగా శస్త్రచికిత్స చేయించుకోవడానికి తన వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో సొంత దేశ క్రికెట్ బోర్డును (క్రికెట్ వెస్టిండీస్) సంప్రదించినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు భారత క్రికెట్ బోర్డు ఆపద్బాంధవుడిలా నిలిచిందని గేల్ పేర్కొన్నారు. తాను ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితిని తెలుసుకున్న వెంటనే బీసీసీఐ స్పందించి ఇంగ్లాండ్‌లో అత్యాధునిక శస్త్రచికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని క్రిస్ గేల్ తెలిపారు. ఆ చికిత్స విజయవంతం కావడం వల్లే తాను మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టి తన అంతర్జాతీయ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగించగలిగానని స్పష్టం చేశారు. "నా క్రికెట్ ప్రయాణం మళ్లీ గాడిన పడటానికి కారణమైన బీసీసీఐకి, భారత క్రికెట్ యాజమాన్యానికి నా జీవితాంతం రుణపడి ఉంటాను" అంటూ గేల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న ఆటగాడికి సరిహద్దులతో సంబంధం లేకుండా అండగా నిలిచిన బీసీసీఐ ఔదార్యంపై క్రీడా వర్గాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



# తొక్కేస్తున్న గౌతమ్ గంభీర్ !

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరోసారి నిరాశే ఎదురైంది. వెస్టిండీస్‌తో హైదరాబాద్‌లో జరిగిన నాలుగో టీ20లోనూ అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టులో ఎలాంటి మార్పులు చేయలేదు. దాంతో వైభవ్‌కు తుది జట్టులో అవకాశం రాకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు బుడ్డోడు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు ముందు జట్టులో మార్పులు చేయాలా వద్దా అనే చర్చతో పాటు వైభవ్‌కు ఎప్పుడు అవకాశం దక్కుతుందనే ప్రశ్నలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీకి వీవీఎస్ లక్ష్మణ్, గౌతమ్ గంభీర్‌ల పర్యవేక్షణలో లభించిన అవకాశాలను నెటిజెన్లు చర్చిస్తున్నారు. ఇందుకు సంబందించి గణాంకాలు కూడా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) అధిపతిగా ఉన్న లక్ష్మణ్.. టీమిండియా తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో వైభవ్‌కు ఎక్కువగా ఆడే అవకాశం దక్కింది. రెగ్యులర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హయాంలో మాత్రం అతడు తక్కువ మ్యాచ్‌ల్లోనే మైదానంలోకి దిగాడు. భారత్ తరఫున ఇప్పటివరకు ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ.. ఐదు మ్యాచ్‌ల్లో వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో బరిలోకి దిగాడు. గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో 14 మ్యాచ్‌లలో కేవలం మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడే అవకాశం దక్కింది. ఈ గణాంకాలే ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చకు కారణమయ్యాయి. ఈ ఏడాది ప్రారంభంలో జింబాబ్వే పర్యటనలోని టీ20 సిరీస్‌తో పాటు 2026 ఆసియా క్రీడల్లోనూ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ భారత జట్టు బాధ్యతలు నిర్వహించాడు. జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ వైభవ్ ఆడాడు. ఆసియా క్రీడల్లోనూ భారత్ తరఫున సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ వర్షం కారణంగా రద్దు కావడంతో.. మెరుగైన ర్యాంకింగ్ ఆధారంగా భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడలేదు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న వైభవ్ సూర్యవంశీ గణాంకాలు కూడా ఆకట్టుకుంటున్నాయి. ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 246 పరుగులు చేసిన అతడు.. 186 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఇంతటి దూకుడైన ఆటతీరు ఉన్న యువ ఆటగాడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై ఇటీవల మాజీ భారత క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా స్పందించాడు. ప్రతిభ ఉన్న ఆటగాడికి వయసు అడ్డంకి కాకూడదని అభిప్రాయపడ్డాడు. అండర్-19 వంటి వయోపరిమితి టోర్నీల్లో వయసు నిబంధనలు ముఖ్యమని, అయితే ఐపీఎల్ లేదా భారత జట్టు తరఫున ఆడే స్థాయికి చేరుకున్న తర్వాత ఆటగాడి ప్రదర్శనే కీలకమని పేర్కొన్నాడు.

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లలో లాభాల జోరు..



దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం కొనుగోళ్ల ఉత్సాహం వెల్లువెత్తింది. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో పాటు ప్రధానంగా ఐటీ దిగ్గజ సంస్థల అద్భుత పనితీరుతో సూచీలు భారీ లాభాల బాట పట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1,100 పాయింట్లు ఎగిసి 73,883 మార్కును తాకగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 319 పాయింట్ల లాభంతో 22,940 పాయింట్ల వద్ద పటిష్టంగా ట్రేడవుతోంది. ఇటీవల మార్కెట్లలో నెలకొన్న ఒడిదుడుకులకు బ్రేక్ వేస్తూ సూచీలు ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో పెరగడంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది. బ్యాంకింగ్, ఆటో రంగాలు కూడా తోడవడంతో ట్రేడింగ్ ప్రారంభం నుంచే మార్కెట్లలో బుల్ జోరు స్పష్టంగా కనిపించింది. ఐటీ రంగ అగ్రగామి సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రెండో త్రైమాసికం ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించడం మార్కెట్లకు ప్రధాన చోదక శక్తిగా మారింది. దీంతో ఇన్వెస్టర్లు ఐటీ రంగ షేర్ల కొనుగోళ్లపై తీవ్ర ఆసక్తి కనబరిచారు. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ వంటి ప్రముఖ ఐటీ షేర్లు 3 శాతానికి పైగా లాభపడి మార్కెట్ల ర్యాలీకి నాయకత్వం వహించాయి. రాబోయే రోజుల్లో ఇతర కంపెనీల త్రైమాసిక ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలోపేతం చేశాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## పెరిగిన విదేశీ పెట్టుబడులు..

ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ గురువారం ఉదయం కొంత పుంజుకుంది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి డాలర్‌తో రూపాయి విలువ రూ.95.15 వద్ద ఉండగా, గురువారం మార్కెట్ ప్రారంభంలో 23 పైసల లాభంతో రూ.94.92 వద్ద మొదలైంది. డాలర్ బలం ముందు రూపాయి పట్టు సడలుతున్న తరుణంలో, ఈ చిన్నపాటి పెరుగుదల ఆర్థిక విశ్లేషకులకు కొంత ఊరటనిస్తోంది. సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో వచ్చే మార్పులు, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, విదేశీ పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం, దేశీయ స్టాక్ మార్కెట్ కదలికలు రూపాయి విలువపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుంటాయి. విదేశీ మార్కెట్లలో డాలర్ విలువ తగ్గినప్పుడు, దేశంలోకి విదేశీ పెట్టుబడులు పెరిగినప్పుడు రూపాయి మరింత బలోపేతం అవుతుంది. రూపాయి విలువ పెరగడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా మనం ఎక్కువగా దిగుమతి చేసుకునే ముడి చమురు, ఎలక్ట్రానిక్స్, యంత్రాల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. దిగుమతి ఖర్చులు తగ్గడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది.. దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలు స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది. అయితే.. రూపాయి బలపడటం వల్ల ఎగుమతి చేసే వ్యాపారులకు, ఐటీ రంగ సంస్థలకు వచ్చే రాబడిపై రూపాయి మార్పిడి రేటు ప్రభావం పడవచ్చు. ఏదేమైనా.. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్థిరంగా ఉండటం అనేది దేశ ఆర్థిక వృద్ధికి, అంతర్జాతీయ వాణిజ్య సమతుల్యతకు ఎంతో ముఖ్యం.

## ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్




ప్రభుత్వ రంగ ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన 'ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్' సంస్థకు రూ. 52,878 కోట్లకు విక్రయించే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో ఎయిర్ ఇండియా తర్వాత దేశంలోనే అతిపెద్ద ప్రైవేటీకరణగా ఇది నిలిచింది. ఇందులో భాగంగా ప్రభుత్వం వద్ద ఉన్న 30.48 శాతం, ఎల్ఐసీ వద్ద ఉన్న 30.24 శాతం ఈక్విటీ వాటాలు ఫెయిర్‌ఫాక్స్ చేతికి వెళ్లనున్నాయి. ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి ఉమ్మడిగా 34 శాతం మైనారిటీ వాటాను కలిగి ఉంటాయి. దేశ ఆర్థిక రంగ చరిత్రలోనే రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నమోదు కానున్న ఈ ఒప్పందం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తవుతుందని దీపమ్ కార్యదర్శి అరుణిష్ చావ్లా స్పష్టం చేశారు. నియంత్రణ సంస్థల ఆమోదాలు లభించిన అనంతరం ఫెయిర్‌ఫాక్స్ మైనారిటీ ఇన్వెస్టర్లకు ఓపెన్ ఆఫర్ ఇవ్వడంతో పాటు నిబంధనల ప్రకారం రెండేళ్లలోపు తమ వద్ద ఉన్న సీఎస్‌బీ బ్యాంక్ వాటాలను ఐడీబీఐలో విలీనం చేయడం లేదా ఉపసంహరించుకోవడం చేయాల్సి ఉంటుంది.

## మళ్లీ తగ్గిన పసిడి..



భారత్‌లో బంగారం ధరల పతనం కొనసాగుతోంది. గత మూడు రోజులుగా వరుసగా తగ్గిన బంగారం ధరలు నేడు మరింతగా పతనమయ్యాయి. పండగ వేళ బంగారం కొనాలనుకునే వారికి ఊరటనిస్తూ నేడు మేలిమి బంగారం మరో రూ.820 మేర పతనమైంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,47,440కు పడిపోయింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.750 మేర తగ్గి రూ.1,35,150కు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా కొంత తగ్గింది. నిన్నటితో పోలిస్తే కిలో వెండి ధర రూ.5 వేల మేర తగ్గి రూ.2.4 లక్షలకు చేరుకుంది.

## చైనాతో భారత్ వాణిజ్య లోటు



చైనాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా పెరుగుతున్నప్పటికీ, వాణిజ్య లోటు మాత్రం 100 బిలియన్ల మార్కును దాటిపోయింది. చైనా కస్టమ్స్ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో (జనవరి--సెప్టెంబర్) భారత్-చైనాల మొత్తం వ్యాపారం 25.4 శాతం పెరిగి 144.45 బిలియన్ డాలర్ల(రూ. 13.76 లక్షల కోట్ల)కు చేరగా, ఇందులో భారత వాణిజ్య లోటు గతేడాదితో పోలిస్తే 20.7 శాతం పెరిగి 105.93 బిలియన్ డాలర్ల(రూ. 10.01 లక్షల కోట్ల) రికార్డు స్థాయికి ఎగబాకింది. ఇదే సమయంలో చైనాకు భారత ఎగుమతులు 40.7 శాతం పెరిగి 19.26 బిలియన్ డాలర్ల(రూ. 1.83 లక్షల కోట్ల)కు చేరినప్పటికీ, మన దేశ తయారీ రంగానికి అవసరమైన ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రసాయనాల కోసం చైనా నుంచి ఏకంగా 125.19 బిలియన్ డాలర్ల(రూ. 11.93 లక్షల కోట్లతో 23.3 శాతం ఎక్కువగా దిగుమతులు చేసుకోవడం వాణిజ్య లోటును విపరీతంగా పెంచేసింది. భారత్ నుంచి ఖనిజాలు, ఇంధనాలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు సాగుతున్నప్పటికీ, మన ఐటీ, ఫార్మా ఉత్పత్తులకు చైనా తన మార్కెట్ తలుపులు తెరవకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణమని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.




## తెలుగు పరిశ్రమకు జీవితాంతం రుణపడి ఉంటా...

యంగ్ బ్యూటీ శృతి హాసన్ లోకనాయకుడు కమల్ హాసన్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ, సొంత ప్రతిభ, గ్లామర్‌తోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. కేవలం నటిగానే కాకుండా, సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా మల్టీ టాలెంటెడ్ పర్సనాలిటీగా అలరిస్తున్న శృతి, కెరీర్ ప్రారంభంలో అనేక హెచ్చుతగ్గులను ఎదుర్కొన్నారు. మొదట్లో ఆమె నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో కొందరు ఆమెకు 'ఐరన్ లెగ్' అనే ముద్ర వేశారు. అలాంటి కష్ట సమ-యంలో అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ వరుస అవకాశాలు దక్కించుకుని స్టార్ బ్యూటీగా మారారు.భారీ ప్రాజెక్ట్స్‌తో ఫుల్ బిజీగా ఉన్న శృతి.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' సినిమా తన సినీ ప్రయాణాన్ని ఒక్కసారిగా తిప్పిరాసిందని తెలిపారు. అందరూ తనను ఐరన్ లెగ్ అని సందేహిస్తున్న సమయంలో తెలుగు ఇండస్ట్రీ తనకు అద్భుతమైన అవకాశం ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా భారీ హిట్ అవ్వడంతోనే టాలీవుడ్‌లో వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లు వచ్చాయని చెప్పారు. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని శృతి ఎమోషనల్ అయ్యారు.

# హైదరాబాద్‌లోనే 'దాదా'!




నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ధమాకా 'దాదా'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా ముగింపు దశకు చేరుకుంటోంది. ఇటీవల మైసూర్‌లో భారీ ఎత్తున ప్రారంభమైన కీలక యాక్షన్ షెడ్యూల్ దాదాపు పూర్తి కావొచ్చిందట. తాజాగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం అవుతున్న సమాచారం ప్రకారం.. మైసూర్ షెడ్యూల్ ప్యాకప్ అవ్వగానే టీమ్ నేరుగా హైదరాబాద్ చేరుకోనుందని తెలుస్తుంది. నగరంలో మరో ఐదారు రోజుల పాటు జరిగే లాస్ట్ షెడ్యూల్‌తో ఈ చిత్రానికి సంబంధించిన టోటల్ టాకీ పార్ట్ పూ-ర్తయిపోనుందని సమాచారం. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో కాకినాడ షెడ్యూల్ చిత్రీకరణ సమయంలో బాలకృష్ణ గాయం కావడంతో షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే.అయితే ఆ గాయం నుంచి బాలయ్య పూర్తి స్థాయిలో కోలుకుని, రెట్టింపు ఉత్సాహంతో అక్టోబర్ మొదటి వారంలోనే మైసూర్ సెట్స్‌లోకి అడుగుపెట్టారు. అక్కడ ఏమాత్రం రాజీ పడకుండా భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను పూర్తి చేసి రికార్డు సమయంలో షూటింగ్ పార్ట్‌ని కొలిక్కి తెచ్చారని చెబుతున్నారు. ఇక హైదరాబాద్‌లో ప్లాన్ చేసిన ఆఖరి షెడ్యూల్ పూర్తయితే షూటింగ్‌కి గుమ్మడికాయ కొట్టేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను పరుగులు పెట్టించనున్నారని సమాచారం. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీష్ కిలారు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అనుకున్న సమయానికి, అంటే క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి దించేందుకు చిత్ర బృందం పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలయ్య-గోపీచంద్ మలినేని-తమన్ ఎస్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ హీరోయి-న్‌గా నటిస్తుండగా, మంచు మనోజ్ నెవర్ బిఫోర్ అనేలా అత్యంత పవర్‌ఫుల్ విలన్ రోల్‌లో కనిపించబోతున్నారు. వీరితో పాటు బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

## భారీ ప్రాజెక్ట్ షురూ..




'మండాడి' సినిమాతో అద్భుతమైన విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న నటుడు సూరి, తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రముఖ టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌తో కలసి చేస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 'సూరి-7' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల అధికారిక ప్రకటన రాగా.. తాజాగా, ఈ చిత్ర ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి, క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు ఆశీస్సులు అందించారు. ఈ సినిమాలో సూరి సరసన రజిషా విజయన్ హీరోయి-న్‌గా నటిస్తుండగా, చైల్డ్ ఆర్టిస్ట్ బేబీ జారా కీలక పాత్రలో కనిపించనుంది.

## రెండేళ్ల తర్వాత టాలీవుడ్‌లోకి!




హిందీ సినిమాలతో మెప్పించిన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ గాయత్రి భరద్వాజ్, తెలుగులో రొమాంటిక్, బడ్డీ, టైగర్ నాగేశ్వర రావు వంటి చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన విజయం దక్కలేదు. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని బాలీవుడ్‌లోనే బిజీ అయిపోయారు. అయితే, ఇప్పుడు దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తెలుగు ఇండస్ట్రీ నుంచి ఆమెకు భారీ ఆఫర్ వచ్చింది. యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న భారీ పాన్-ఇండియా ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'కరికాల'లో గాయత్రీ భరద్వాజ్ కీలక పాత్రకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ప్రత్యేకంగా స్వాగతం పలికారు.'అందమైన గాయత్రి భరత్వాజ్‌ను 'కరికాల' అద్భుత ప్రపంచంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఇక్కడ అందం అద్భుతంతో సంగమిస్తుంది, ప్రతి కథకూ ఒక ప్రత్యేకమైన మంత్రముగ్ధత ఉంటుంది" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'శంబాల' సినిమాతో బాక్సాఫీస్ వద్ద హ్యాట్రిక్ విజయం సాధించిన మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మల్టీస్టారర్ ఫాంటసీ డ్రామాలో కేథరిన్, సాక్షి అగర్వాల్ కూడా నటిస్తున్నారు. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పాన్-ఇండియా మూవీ తొలి భాగం 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ పక్కా ప్లాన్ చేస్తున్నారు.

# సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్'




ఇంద్ర రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'డోంట్ స్లీప్'. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, షమ్ దత్ సైనుద్దీన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. 'వి డ్రీమ్ ఫిలిమ్స్' బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఇస్తున్న వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ టీజర్‌ను అక్కినేని నాగచైతన్య విడుదల చేశారు. డోంట్ స్లీప్' టీజర్‌ను విడుదల చేయడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఈ టీజర్ చాలా ఆసక్తికరంగా, ఎంతో పదునుగా ఉందని అక్కినేని నాగచైతన్య చెప్పారు. ఈ సినిమాతో దర్శకుడిగా మార-తున్న షమ్ దత్ గారు, తన మొదటి ప్రయ-త్నంలోనే సరిహద్దులు దాటి కొత్తగా సినిమా తీయడం చూడటానికి చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇందులో చూపించిన దృశ్యాలు, కథ చెప్పిన విధానం తనకు ఎంతగానో నచ్చాయని మెచ్చుకున్నారు. అలాగే ఈ సినిమా కోసం హీరో ఇంద్ర రామ్ ఎంతగా కష్టపడ్డారో తనకు బాగా తెలుసని, ఆయన పడ్డ శ్రమ ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఆయన పడిన ఈ కష్టానికి ఖచ్చితంగా మంచి ఫలితం దక్కుతుందని తాను గట్టిగా నమ్ముతున్నానని నాగచైతన్య అన్నారు. ఇక టీజర్ విషయానికొస్తే.. ప్రారంభం నుంచే మైండ్ బ్లాకింగ్ సస్పెన్స్ ఎలిమెంట్స్, గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సీన్స్‌తో ఆసక్తికరంగా సాగింది.




# దిల్ రాజు చేతికి థ్రిల్లర్ 'హత'

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇప్పటికే ఆయన నిర్మాణ సంస్థ నుంచి వచ్చిన 'తిమ్మరాజుపల్లి టీవీ' ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన అందుకుంది. ఇప్పుడు అదే జోరులో థ్రిల్లర్ జానర్‌తో 'హత:' అనే సరికొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇందులో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.అనుష్ గోరాక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించిన బిజినెస్ పరంగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన నిజామ్, ఉత్తరాంధ్ర థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్‌వీసీ దక్కించుకుంది. టాలీవుడ్ SVC ప్రొడ్యూసర్ దిల్ రాజు ఒకే తేదీన ఒక భారీ సినిమాతో పాటు ఈ చిన్న సినిమాను కూడా పంపిణీ చేస్తుండటం విశేషం. దిల్ రాజు సపోర్ట్ దక్కడంతో ఈ థ్రిల్లర్ మూవీపై అంచనాలు మరింత పెరిగిపోయాయి.




## భిన్నమైన రోల్సే నా లక్ష్యం

'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని సాధించిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. వరుస చాన్స్‌లతో జోరుమీదున్నారు. 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టబోతున్న ఈ భామ తాజాగా, ఓ ఇంటర్వ్యూలోసినిమాల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మనం చేసే సినిమాలను ఎలా ఎంచుకుంటాం, మనల్ని మనం ప్రేక్షకులకు ఎలా చూపించుకుంటాం అనే దానిపైనే మనకు వచ్చే పాత్రలు ఆధారపడి ఉంటాయని భాగ్యశ్రీ చెప్పారు.తాను ఇప్పటివరకు 'కాంత, లెనిన్, కింగ్‌డమ్ వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరించానని తెలిపారు. ఇప్పుడు నటిగా తన లక్ష్యం అన్ని రకాల పాత్రలను వెతకడం, ప్రతి సినిమాలోనూ మరింత బాగా నటించడం అని చెప్పారు. ఏ పాత్ర ఇచ్చినా సరే దానిని అద్భుతంగా చేయగలననే గట్టి నమ్మకం తనకు ఉందని తెలిపారు. అందుకే తాను ఒకే రకమైన పాత్రలకే పరిమితం అయిపోతానేమోనని ఎప్పుడూ ఆందోళన చెందనని, భిన్నమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరించడమేనని చెప్పుకొచ్చారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**